Follow: @ANNTELUGU

ANN తెలుగు

08-09-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 230  పేజీలు-08  వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర

**: సీపీఎం నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణసభలో సీఎం**

**హైదరాబాద్, మహా :** ఎస్ఐఆర్‌ను ఆయుధంగా చేసుకుని తెలంగాణ రాష్ట్రంలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఏకమై మోదీ సర్కారుపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఎం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌లపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో పేదలు, గిరిజనుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. కొడంగల్ నుంచి వలస వెళ్లిన వేల మంది పేదల ఓట్లను ఈసీ తొలగిస్తోందని ఆరోపించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీ వ్యతిరేకుల ఓట్లను తొలగిస్తున్నారని

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### కేసీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుతారు



- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నీళ్ళ విషయంలో కేసీఆర్ కు నాలెడ్జ్ లేదు

04

### అక్టోబర్ 7 వరకు సర్




- క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు గడువు పొడిగింపు
- నవంబర్ 5లోపు దరఖాస్తుల పరిష్కారం. ఎన్నికల సంఘం ప్రకటన

03

### పోలీసులపై దాడులు చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కేసు



- తాతా మధుతో పాటు నవీన్ కుమార్ రెడ్డిపై కూడా వేటుపడే ఛాన్స్

02



### 12 వరకు తెలంగాణ అసెంబ్లీ

- బీఏసీలో కీలక నిర్ణయాలు
- 22ఏ భూములపై న్యాయ విచారణకు బీజేపీ పట్టు.
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు ఆమోదం.
- 25 ప్రధాన అంశాలపై చర్చకు ప్రతిపక్షాల డిమాండ్.

02

నందూస్ వరల్డ్ యూట్యూబర్

### నందన అరెస్ట్

- ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగింత

02

### మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

02

- రాజకీయ విమర్శలు ఓకే.. మహిళలను కించపరిచే మాటలకు మాత్రం చోటు లేదు.
- జయలలిత అవమాన ఘటనను గుర్తుచేసిన విజయ్.
- చట్టపరమైన చర్యలు తప్పవని సీఎం విజయ్ హెచ్చరిక స్పష్టీకరణ



### స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- టీడీపీ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం.
- కూటమిలో సఖ్యతగా ఉండాలి.
- నేతల మధ్య గ్యాప్‌లు ఉండకూడదు.
- ప్రతి నియోజకవర్గంలో 25 ప్రాధాన్యతాంశాలు.
- ఎమ్మెల్యేలకు చంద్రబాబు టార్గెట్లు.

02

### మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

- రాజకీయ విమర్శలు ఓకే.. మహిళలను కించపరిచే మాటలకు మాత్రం చోటు లేదు.
- జయలలిత అవమాన ఘటనను గుర్తుచేసిన విజయ్.
- చట్టపరమైన చర్యలు తప్పవని సీఎం విజయ్ హెచ్చరిక స్పష్టీకరణ

02







## అసెంబ్లీ చరిత్రలో బ్లాక్ డే

# సభాపతి కంటతడి

### స్పీకర్ ఎవడ్రా.. ఆ లం.. కొడుకు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతామధు

- తన తల్లిని దూషించారని కంటతడి పెట్టిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- పోలీసులపై చేయి చేసుకున్న కేటీఆర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి, నవీన్ కుమార్ రెడ్డి
- మహిళా పోలీసుల ముందే చొక్కాలు విప్పేసిన హరీష్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- తోపులాటలో కేటీఆర్, జగదీష్ రెడ్డికి స్వల్ప గాయాలు
- సబితా ఇంద్రారెడ్డిని ముందుకు తోసేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు
- సునితా లక్ష్మారెడ్డి చీర లాగారంలూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆగ్రహం.. రణరంగంగా అసెంబ్లీ
- స్లోగన్స్ టీషర్ట్ లతో సభకు రావడం.. సభా సంప్రదాయాలకు విరుద్ధమన్న అసెంబ్లీ వ్యవహారాల మంత్రి
- స్వతంత్ర భారతంలో ఏ స్పీకర్ కు ఇలాంటి అవమానం జరగలేదన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కేసీఆర్ క్షమాపణలు చెప్పాలని, ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయాలని సీఎం, కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల డిమాండ్
- కేసీఆర్ క్షమాపణలు చెప్పాలన్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి
- అనుచిత వ్యాఖ్యలను తేలికగా తీసుకోబోమన్న స్పీకర్.. నేడు అసెంబ్లీలో తీర్మానం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ రణరంగంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ స్పీకర్ అన్న మర్యాద లేకుండా ఎవడ్రా స్పీకర్, ఎవడ్రా మీకు అధికారం ఇచ్చింది అంటూ ఏక వచన సంబోధన చేయటమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించడంతో ఒక్కసారిగా నేతలంతా నివ్వెరపోయారు. ఆ లం..కొడుకు అంటూ నోరు జారడంతో స్పీకర్ ను అవమానించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీని తక్షణమే సభ్యత్వం రద్దు చేయడంతో పాటు ఇలా చేయమని రెచ్చగొట్టి పంపిన కేసీఆర్ సభకు వచ్చి క్షమాపణ చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు

మిగతా 2వ పేజీలో





### నా గుండె తరుక్కుపోయింది

- స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆవేదన
- ఆ వ్యాఖ్యలను తేలిగ్గా తీసుకోం

02

స్వతంత్రభారతంలో..

## ఇంత అవమానం ఎన్నడూ జరగలేదు

- కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి
- దారుణంగా ప్రవర్తించిన ఎమ్మెల్సీని బర్తరఫ్ చేయాలి
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** స్వతంత్ర భారతంలో సభాపతికి ఇలాంటి అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదని, ఇలాంటి భాష వాడిన సభ్యుడిని డిస్మిస్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండించే అంశంపై సభలో చర్చ జరిగింది. తాను అన్ని సభలను చూశానని, కానీ ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదన్నారు. ఇలాంటి వాటిని క్షమిస్తే చట్టసభలకు గౌరవం

మిగతా 2వ పేజీలో

### ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోలేరు

- హైకోర్టు కీలక ఆదేశాలు.
- మహిళా ఎమ్మెల్యేలపై దురుసు ప్రవర్తనపై సీరియస్.
- సభలో సభ్యులు తప్పు చేస్తే స్పీకరే చర్యలు తీసుకోవాలి: తెలంగాణ హైకోర్టు

04



### స్పీకర్‌కు క్షమాపణ చెప్పిన తర్వాతే మిగిలిన ఎజెండా

- ఎమ్మెల్యేలు అదే కోరుతున్నారు
- కేసీఆర్ సభకు వచ్చి క్షమాపణలు చెప్పాలి
- అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు

02





### శాసనసభ కాదు.. దుశ్శాసనసభ

04

## అసెంబ్లీ చరిత్రలో బ్లాక్ డే

# సభాపతి కంటతడి

( మొదటి పేజీ తరువాయి)



. తనకు జరిగిన అవమానంపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఒక దశలో భావోద్వేగానికి లోనై సభలోనే కంటతడి పెట్టారు. నల్ల టీషర్ట్ లపై స్లోగన్స్ రాసుకుని వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభలోకి అనుమతించకపోగా, అసెంబ్లీ ప్రాంగణలంలోనే అడ్డుకుని స్లోగన్స్ ఉన్న టీషర్ట్స్ ను నిబంధనల ప్రకారం అనుమతించమని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో కోపోద్రిక్తుడైన హరీష్ టీషర్ట్ విప్పేసి.. బనియన్ పైనే తమను లోపలికి పంపాలని డిమాండ్ చేశారు. హరీష్ తరహాలో మరికొందరు ఎమ్మెల్యేలు కూడా మహిళా పోలీసుల ముందే చొక్కాలు విప్పడంతో పోలీసులు షాకయ్యారు. మరోవైపు తమను పంపాల్సిందేనంటూ పోలీసులను బెదిరించడంతో పాటు నెట్టివేయగా, ఓ సభ్యుడు పోలీసు కాలర్ కూడా పట్టుకున్నారు. కేటీఆర్ పోలీసులపై చేయి చేసుకున్నారని మంత్రి శ్రీధర్ బాబు తెలపగా, నవీన్ రెడ్డి తీవ్రంగా బూతులు మాట్లాడారు. ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాసరెడ్డిలు కూడా చేయిచేసుకున్నట్లు కాంగ్రెస్ సభ్యులు వీడియో ఫుటేజీతో ఫిర్యాదుచేశారు. వీడియో ఫుటేజ్ ఆధారంగా మరికొందరు సభ్యులపై కూడా చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. మంగళవారం కూడా స్పీకర్ అంశంపై చర్చ జరిగిన తర్వాతనే మిగతా అంశాలు ముందుకు కదిలే అవకాశం ఉంది. సభ్యుడి సభ్యత్వ రద్దు చేయాలని శాసనసభలో తీర్మానం చేసి కౌన్సిల్ కు పంపనున్నారు. స్పీకర్ కు జరిగిన అవమానంపై మిగతా పార్టీలు కూడా తీవ్రంగా స్పందించాయి. మరోవైపు తోపులాటలో జగదీష్ రెడ్డి కిందపడగా, కేటీఆర్ కు, శంభీపూర్ రాజుకు కూడా స్వల్ప గాయాలయ్యాయి.

# నా గుండె తరుక్కుపోయింది

**స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆవేదన**
**ఆ వ్యాఖ్యలను తేలిగ్గా తీసుకోం**

**హైదరాబాద్, మహా :** అసెంబ్లీ వేదికగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ ప్రసాద్ కుమార్ స్పందించారు. మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ తాతా మధు అసెంబ్లీ గేట్ వద్ద తనపై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా బాధించాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై చేసిన వ్యాఖ్యలకు సభలో మంత్రి సీతక్క కన్నీరు పెట్టుకోవడాన్ని ఆయన ప్రస్తావించారు. గత ఐదేళ్లుగా మంత్రి సీతక్క తనకు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా రాఖీ కడుతున్నారని గుర్తుచేశారు. అలాంటి సోదరి లాంటి మంత్రి సభలో తనను అవమానించారంటూ కన్నీరు కారుస్తుంటే తన గుండె తరుక్కుపోయిందని, సభలోనే తన దు:ఖం అసలు ఆగలేదని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. సభాపతి స్థానంలో ఉన్న తనను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలను తేలికగా తీసుకోబోమన్న సంకేతాలను స్పీకర్ ఇచ్చారు. ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలపై త్వరలోనే శాసనసభలో ప్రత్యేకంగా ఓ తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ఆ తీర్మానాన్ని తదుపరి చర్యల నిమిత్తం శాసనమండలికి పంపుతామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు.

# 12 వరకు తెలంగాణ అసెంబ్లీ

- **బీఏసీలో కీలక నిర్ణయాలు.**
- **22ఏ భూములపై న్యాయ విచారణకు బీజేపీ పట్టు.**
- **ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు ఆమోదం.**
- **25 ప్రధాన అంశాలపై చర్చకు ప్రతిపక్షాల డిమాండ్.**

**హైదరాబాద్: మహా :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 12వరకు జరగనున్నాయి. అసెంబ్లీతో పాటు శాసనమండలి సమావేశాలను కూడా వారం రోజుల పాటు కొనసాగించనున్నారు. చర్చించాల్సిన అంశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో అవసరమైతే సమావేశాలను మరిన్ని రోజులు పొడిగించే అంశంపై మరోసారి బీఏసీ సమావేశమై నిర్ణయం తీసుకుకోవాలని నిర్ణయించారు. వినాయకచవితి ఈ నెల 14న ఉన్న నేథ్యంలో అన్ని గ్రామాలు, నియోజకవర్గాల్లో పండుగ వాతావరణం ఉంటుంది. వినాయకచవితి సమయంలో బందోబస్తు అవసరాల రీత్యా అసెంబ్లీ నిర్వహణకు పోలీసు బందోబస్తు కొనసాగించలేరు. ఈ నేపథ్యంలో 12తో అసెంబ్లీ ముగియనుంది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏ భూముల వ్యవహారం, రైతుల సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ హామీల అమలు తదితర అంశాలపై అధికార, ప్రతిపక్ష సభ్యులు తమ వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. సభా సమావేశాల్లో 22ఏ భూముల వ్యవహారం ప్రధాన రాజకీయ అంశంగా మారింది. నిషేధిత ఆస్తుల జాబితాలో భూములను చేర్చడం, తొలగించడం, ఆయా భూములపై నెలకొన్న వివాదాలపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ వ్యవహారంపై సాధారణ చర్చతో సరిపెట్టకుండా సిట్టింగ్ న్యాయమూర్తితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని బీజేపీ నేతలు పట్టుబడుతున్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశానికి కూడా బీఏసీ అజెండాలో చోటు కల్పించింది. పెండింగ్ ఫీజు బకాయిలు, విద్యార్థులు మరియు విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ఇంకా చెల్లించాల్సిన బకాయిలపై సభలో చర్చ జరిగే అవకాశం ఉంది.

# ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోలేరు

- **హైకోర్టు కీలక ఆదేశాలు.**
- **మహిళా ఎమ్మెల్యేలపై దురుసు ప్రవర్తనపై సీరియస్.**
- **సభలో సభ్యులు తప్పు చేస్తే స్పీకరే చర్యలు తీసుకోవాలి: తెలంగాణ హైకోర్టు**

**హైదరాబాద్: మహా :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజు అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలు, పోలీసుల తీరుపై వివాదం ముదిరిన నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు జోక్యం చేసుకుంది. శాసనసభ, శాసనమండలి సమావేశాలకు హాజరయ్యే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ప్రజాప్రతినిధులు తమ విధులకు హాజరవుతున్న సమయంలో పోలీసుల జోక్యం సరికాదని తేల్చిచెప్పింది.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించడంతో ఈ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. అసెంబ్లీ, మండలి సమావేశాలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోరాదని కోర్టు స్పష్టం చేసినట్లు సమాచారం. శాసనసభ్యులు సభకు హాజరయ్యే హక్కును పోలీసులు తమ చర్యల ద్వారా నిరోధించకూడదని పేర్కొంది.సభలో సభ్యులు ఏదైనా నిబంధన ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు మాత్రమే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. శాసనసభ్యులపై పోలీసులు స్వయంగా చర్యలు తీసుకునే అధికారం లేదని పేర్కొన్నట్లు సమాచారం. సభా వ్యవహారాలు, సభ్యుల ప్రవర్తనకు సంబంధించిన అంశాల్లో శాసనసభా నియమాలు, స్పీకర్ అధికారాలే కీలకమని ధర్మాసనం స్పష్టం చేసింది.అసెంబ్లీ సమావేశాల తొలిరోజు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చిన సమయంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. నినాదాలతో కూడిన టీషర్టులతో అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్లేందుకు పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు.

**మహిళా ఎమ్మెల్యేలపై ఘటనపై తీవ్ర ఆగ్రహం**

నిరసనల సందర్భంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారన్న ఆరోపణలను హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. మహిళా ప్రజాప్రతినిధులపై దాడి లేదా అనుచితంగా ప్రవర్తించిన పోలీసు సిబ్బందిని గుర్తించాలని ఆదేశించింది. బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించినట్లు సమాచారం. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల ప్రవర్తనకు సంబంధించిన అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఘటనకు సంబంధించిన వివరాలను కోర్టు ముందుంచాలని ప్రభుత్వ తరఫు న్యాయవాదికి నోటీసులు జారీ చేసింది.ప్రజాప్రతినిధుల విధులకు ఆటంకం కలిగించే విధంగా పోలీసులు వ్యవహరించకూడదని కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో అసెంబ్లీ పరిసరాల్లో జరిగిన పరిణామాలపై రాజకీయంగా మరింత చర్చ మొదలైంది. సభకు వెళ్లే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల విషయంలో పోలీసుల పాత్ర, శాసనసభ స్పీకర్ అధికారాలపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఇరువైపుల వాదనలు విన్న అనంతరం ఈ కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటిలోగా ప్రభుత్వం ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది.అసెంబ్లీ సమావేశాల తొలిరోజే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య చోటుచేసుకున్న వివాదం రాజకీయ దుమారం రేపగా.. తాజాగా హైకోర్టు జోక్యంతో వ్యవహారం న్యాయస్థానం పరిధిలోకి వెళ్లింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభకు హాజరుకాకుండా పోలీసులు అడ్డుకోవడంపై కోర్టు స్పష్టమైన వైఖరి వ్యక్తం చేయడం, మహిళా ఎమ్మెల్యేలపై దురుసు ప్రవర్తనకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది.

## స్వతంత్రభారతంలో..

# ఇంత అవమానం ఎన్నడూ జరగలేదు

( మొదటి పేజీ తరువాయి )



, మర్యాద ఉండదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అసభ్యకర భాషను వాడిన సభ్యుడి చేత కేసీఆర్ రాజీనామా చేయించాలని సీఎం డిమాండ్ చేశారు. వాయిదా అనంతరం శాసనసభ ప్రారంభమైన తరువాత స్పీకర్‌కు అవమానం జరిగిందని, ఆ అంశంపై చర్చ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముందుగా 22ఏ పై చర్చ జరపాలని బీజేపీ డిమాండ్ చేసింది. కమలం సభ్యుల తీరును ముఖ్యమంత్రి తప్పుపట్టారు. బీఆర్ఎస్ నేతల అపవాదును బీజేపీ నేతలు ఎందుకు మోస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. స్పీకర్‌కు అవమానం జరిగిన ఈరోజు తెలంగాణకు చీకటి రోజు అని, ఈరోజు నాలుగు కోట్ల ప్రజలకు అవమానం జరిగిన రోజు అని సీఎం ప్రకటించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యేలను నిన్న పిలిపించుకుని స్పీకర్‌పై ఉసిగొల్పారని ఆరోపించారు. ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదని, పథకం ప్రకారం జరిగిందేనని పేర్కొన్నారు.

**వైద్యుడినే గాయపరిచినట్లు**

స్పీకర్‌ను అవమానించడమంటే వైద్యం చేసే వైద్యుడినే గాయపరిచినట్టు ఉందని సీఎం అన్నారు. సభాపతికి జరిగిన అవమానం సభకు జరిగిన అవమానంగానే భావించాలని, స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చకు బీజేపీ సభ్యులు సహకరించాలని కోరారు. స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చ తర్వాత ఏ అంశంపైనైనా చర్చిద్దామని తెలిపారు.

**అసభ్యకర భాషను వాడిన సభ్యుడిని బర్తరఫ్ చేయాలి : ఏలేటి**

స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తమ పార్టీ ఖండిస్తోందని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌పై అసభ్యకర భాషను వాడిన సభ్యుడిని బర్తరఫ్ చేయాలన్నారు. తాతా మధు వ్యాఖ్యలకు బాధ్యతగా కేసీఆర్ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ క్షమాపణ చెప్పాలి : బీఆర్ఎస్ సభ్యుల తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు మంత్రి సీతక్క. స్పీకర్‌పై అత్యంత హేయమైన భాష వినియోగించారని, ఆ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలకు బాధ్యత వహించి కేసీఆర్ క్షమాపణ చెప్పాలన్నారు.

# స్పీకర్‌కు క్షమాపణ చెప్పిన తర్వాతే మిగిలిన ఎజెండా

- **ఎమ్మెల్యేలు అదే కోరుతున్నారు**
- **కేసీఆర్ సభకు వచ్చి క్షమాపణలు చెప్పాలి**
- **అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, మహా :** అసెంబ్లీ స్పీకర్‌పై అత్యంత హేయంగా వ్యాఖ్యలు చేసిన తమ పార్టీ ఎమ్మెల్సీ వ్యాఖ్యలను కేటీఆర్, హరీష్‌రావులు ఇప్పటివరకు ఖండించలేదని, కనీసం స్పందించలేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. సోమవారం ఆయన సీఎల్పీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎందుకు సమంజసమని, ఈ వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎందుకు ఖండించలేదని నిలదీశారు. స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ డీఎన్ఏలోనే దళిత వ్యతిరేకత ఉందని, గతంలో దళిత డిప్యూటీ సీఎం రాజయ్యను కేసీఆర్ బర్తరఫ్ చేశారని, కడియం శ్రీహరిని సభలో అవమానించారని శ్రీధర్ బాబు తెలిపారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మనోవేదనకు గురై కన్నీళ్లు పెట్టుకున్నారని, బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీగా నిరూపించుకుంటోందని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ సభకు వచ్చి ఘటనపై స్పందించాలని, కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**తీవ్ర మనస్థాపం చెందారు**

అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనపై తమ దళిత ఎమ్మెల్యేలు తీవ్ర మనస్థాపం చెందారని శ్రీధర్ బాబు అన్నారు.. స్పీకర్‌కు క్షమాపణ చెప్పిన తర్వాతే మిగిలిన ఎజెండా తీసుకోవాలని ఎమ్మెల్యేలు అభిప్రాయపడుతున్నారని, అసెంబ్లీ, శాసనమండలి ప్రాంగణంలోని అన్ని అధికారాలు స్పీకర్, చైర్మన్‌కు ఉంటాయని శ్రీధర్ బాబు చెప్పారు. ప్రాంగణంలోకి ఎంటర్ అయిన తర్వాతే బీఆర్ఎస్ నేతల ప్రవర్తన కారణంగా సిబ్బంది అడ్డుకున్నారని, పోలీసు సిబ్బంది కోరినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఎన్ని రోజులైనా అసెంబ్లీ నడపడానికి మేం సిద్ధంగా ఉన్నామని స్పీకర్‌కు తెలిపామని, సభ నిర్వహణలో బీఏసీ నిర్ణయం ప్రకారం నడుచుకుంటామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సభలో, సభ బయట సభ్యుల భాషపై చర్చించాలని బీఏసీలో ప్రస్తావించామన్నారు.

**శాసనసభ్యులుగా ఉండి పోలీసులపై దాడి..**

శాసనసభ్యులుగా ఉండి పోలీసులపై దాడి చేశారని, ఒక బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోలీస్ కాలర్ పట్టుకున్నాడని, పోలీసులపై దాడి స్పష్టంగా కనిపించిందని శ్రీధర్ బాబు అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తాము ఏనాడు పోలీసులపై ఈ విధంగా దాడులు చేయలేదని, కేటీఆర్ స్వయంగా పోలీసులపై దాడి చేసినట్లు కనిపించిందని ఆయన ఆరోపించారు. కేటీఆర్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, నవీన్ రెడ్డిలు దాడి చేసినట్లు వీడియోల్లో కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. అసభ్య పదజాలంతో పోలీసులు దూషించారని, తమ సభ్యుల ప్రవర్తనపై కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే హుందాగా ఉంటుందని శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్స్ రూపొందించిందని, బ్యాడ్జీలు, ప్లకార్డులు నిషేధమని వాళ్లే చెప్పారని శ్రీధర్ బాబు తెలిపారు. టీషర్టులపై స్లోగన్స్ వేసుకుని రావడం సభా సాంప్రదాయాలకు విరుద్ధమన్నారు. రాహుల్ గాంధీ వేసుకున్న టీషర్టుపై ప్రింట్ లేదని, బ్లాక్, వైట్, పింక్ ఏదైనా కలర్లు వేసుకోవచ్చన్నారు. టీషర్టులపై స్లోగన్స్ వేసుకుని వస్తే దాన్ని ప్లకార్డులుగా పరిగణిస్తారని, ఈ విషయం కేటీఆర్, హరీష్ రావు, ఇతర సభ్యులకు తెలుసు అని శ్రీధర్ బాబు చెప్పారు. ఏ కలర్ డ్రెస్ వేసుకుని సభలోకి వచ్చినా ఆపమని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి నిరసనలు తెలపడానికి అన్ని అవకాశాలున్నాయన్నారు.

**నిబంధనల ప్రకారం అసెంబ్లీ నడుస్తుంది..**

సభా గౌరవాన్ని పెంచడంలో స్పీకర్, శాసనమండలి చైర్మన్ అన్ని నిర్ణయాలు తీసుకుంటారని, నిబంధనల ప్రకారం అసెంబ్లీ నడుస్తుందని శ్రీధర్ బాబు చెప్పారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్లకార్డులు అనుమతించకపోతే పక్కన పెట్టి మర్యాదపూర్వకంగా సభకు వెళ్లామన్నారు. మహిళా శాసనసభ్యురాళ్లకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం పోలీసు అధికారులతో సమీక్ష జరిపారని, మహిళా శాసనసభ్యుల విషయంలో ఎక్కడైనా తప్పు జరిగితే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తమ నాయకురాలే స్వయంగా మహిళ అని, మహిళలను గౌరవిస్తామని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సవరించుకుంటామని తెలిపారు. మహిళా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సభలోకి అనుమతి ఇచ్చామని, వాళ్లను అడ్డుకోలేదని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్, హరీష్ రావులు బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ వీళ్ల బెదిరింపులకు భయపడదన్నారు. తాము ఎలాంటి డైవర్షన్ రాజకీయాలు చేయలేదని, స్పీకర్ గౌరవాన్ని కాపాడే బాధ్యత సభ్యులందరిపై ఉంటుందని శ్రీధర్ బాబు అన్నారు. స్పీకర్ వ్యవస్థను, శాసనవ్యవస్థను కించపరిచినప్పుడు సభ్యులందరూ బాధపడాలని, రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తించి మమ్మల్ని క్షమాపణ అడుగుతారా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయరమణారావు, రామచంద్రునాయక్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర

( మొదటి పేజీ తరవాయి )

రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. తెలంగాణలో కోటి ఓట్లు(33 శాతం) తొలగిస్తున్నప్పటికీ బీఆర్ఎస్ నోరెత్తకపోవడాన్ని తప్పుపట్టారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఏకమై మోదీ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వారి(కమ్యూనిస్టుల) సహకారంతోనే హస్తం పార్టీ చేసిన పోరాటాల వల్ల మోదీ నల్లచట్టాలను వెనక్కు తీసుకున్నారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఇవాళ్టి ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. ఓట్ల తొలగింపుపై అంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎర్రజెండాను చూస్తే పేదోడికి ఒక నమ్మకం అని రేవంత్ రెడ్డి అన్నారు. దేశానికి మోదీ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని అన్నారు. ఆయన ఓటమే కమ్యూనిస్టుల గెలుపు అని వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టులు లేవనెత్తే సహేతుకమైన సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డి పేరు రైతులకు సంబంధించిన ఏదైనా సంస్థకు పెడతామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరు అమానుషం

- **గొంతు పట్టి నెట్టేయడం, చీరలు లాగడం, జుట్టు పట్టి ఈడ్చుకెళ్లడం దారుణం**
- **టీఆర్ఎస్ చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం.**

హైదరాబాద్: మహా. తెలంగాణ శాసనసభ ప్రాంగణం వద్ద మహిళా శాసన సభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత అమానుషంగా, దుర్మార్గంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులనే పోలీసులు గౌరవించకుండా వ్యవహరించారని ఆమె ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కవిత సామాజిక మాధ్యమ వేదికగా స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీ సాక్షిగా ప్రశ్నించేందుకు వచ్చిన మాజీ మంత్రులు, సీనియర్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులను పోలీసులు అడ్డుకునే క్రమంలో హద్దులు మీరి ప్రవర్తించారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు అనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించారని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేల గొంతు పట్టి నెట్టేయడం, చీరలు లాగడం, జుట్టు పట్టి ఈడ్చుకెళ్లడం, బూటు కాళ్లతో తొక్కి హింసించడం వంటి చర్యలకు పోలీసులు పాల్పడ్డారని కవిత ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రజాప్రతినిధులతో ఇలాంటి రీతిలో వ్యవహరించడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. మహిళా శాసన సభ్యుల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు.



**చెన్నై: మహా :** రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలను కించపరిచేలా, అసభ్యకరంగా వ్యాఖ్యలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో ప్రత్యర్థులపై తీవ్ర విమర్శలు చేసుకోవడం సహజమేనని.. అయితే భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం మాత్రం ఆమోదయోగ్యం కాదని తేల్చిచెప్పారు. నటి త్రిషను ఉద్దేశించి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో శాసనసభలో సీఎం విజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని విజయ్ పేర్కొన్నారు. తన సినీ ప్రయాణం నుంచి రాజకీయ జీవితంలో ముఖ్యమంత్రి స్థాయికి చేరుకునే వరకు మహిళలు తన జీవితంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఇంట్లో తల్లులు, సోదరీమణులను ఏ విధంగా గౌరవిస్తామో.. సమాజంలోనూ మహిళల పట్ల అదే గౌరవభావాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇటీవల తమిళనాడు రాజకీయాల్లో ద్వంద్వార్థాలు, అశ్లీల పదజాలంతో కూడిన వ్యాఖ్యలు పెరుగుతున్నాయన్న ఆందోళనను సీఎం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఎంతటి తీవ్ర విమర్శలైనా చేసుకోవచ్చని, కానీ మహిళలను అవమానించే హద్దు దాటిన భాషను మాత్రం అనుమతించబోమని స్పష్టం చేశారు. మహిళలను కించపరిచేలా ఎవరైనా మాట్లాడితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు.

**జయలలిత ఘటనను ప్రస్తావించిన సీఎం**

గతంలో ఇదే తమిళనాడు శాసనసభలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత అవమానానికి గురైన ఘటనను విజయ్ ప్రస్తావించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల గౌరవం, శాసనసభలో వారి భద్రత, గౌరవం వంటి అంశాలను రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యల సారాంశంగా ఉంది.మహిళలను కించపరిచే వ్యాఖ్యలను రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవడం సమాజానికి తప్పుడు సంకేతాన్ని ఇస్తుందని విజయ్ అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు, ఘర్షణాత్మక విమర్శలు ఉన్నప్పటికీ వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలకు మాత్రం హద్దులు ఉండాలని స్పష్టం చేశారు.ఉదయనిధి వ్యాఖ్యలపై కొనసాగుతున్న వివాదంకావేరీ నిరసన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు నటి త్రిషను ఉద్దేశించినవేనంటూ వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. అయితే ఉదయనిధి ఎక్కడా త్రిష పేరును ప్రస్తావించలేదని డీఎంకే వర్గాలు చెబుతున్నాయి. రాజకీయంగా లబ్ధి పొందేందుకే ఆయన వ్యాఖ్యలను ఎడిట్ చేసి, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ వర్గాలు ఆరోపించాయి.

మరోవైపు శాసనసభ సమావేశాల అనంతరం ఉదయనిధి స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ సీఎం విజయ్‌పై విమర్శలు చేశారు. డీఎంకేపై ఎలాంటి ఆధారాలు లేకుండా సీఎం ఆరోపణలు చేశారని అన్నారు. అసెంబ్లీలో సీఎం చేసిన ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు ప్రతిపక్షానికి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.కేవలం ఆరోపణలు చేయడం సరిపోదని.. వాటిని నిరూపించే బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉంటుందని ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. దీంతో మహిళలపై అనుచిత వ్యాఖ్యల అంశం కాస్తా అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు దారితీసింది.

# స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలకు నిరసన

**కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం.. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్**

**కారేపల్లి,మహ:** రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, ఇందుకు మాజీ సీఎం కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా తోటకూరి రాంబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన, గౌరవప్రదమైన శాసనసభ స్పీకర్‌ను దూషించిన ఎమ్మెల్సీ తాతా మధును పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన రాజ్యాంగ పదవుల పట్ల గౌరవం పాటించాలని సూచించారు.బీఆర్ఎస్ నాయకులు తమ వైఖరిని మార్చుకోకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు.అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# అక్టోబర్ 7 వరకు సర్

- క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు గడువు పొడిగింపు
- నవంబర్ 5లోపు దరఖాస్తుల పరిష్కారం.
- ఎన్నికల సంఘం ప్రకటన



**హైదరాబాద్: మహా. :** తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియకు సంబంధించి భారత ఎన్నికల సంఘం మరోసారి గడువులను సవరించింది. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు మరింత సమయం కల్పించడంతో పాటు తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని కూడా పొడిగించింది. తాజా నిర్ణయం ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7 వరకు అవకాశం కల్పించారు. వాటి పరిశీలన, నోటీసుల జారీ, విచారణ, పరిష్కార ప్రక్రియను నవంబర్ 5లోపు పూర్తి చేయనున్నారు. అనంతరం నవంబర్ 9న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.ఇది తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియకు సంబంధించి మూడోసారి గడువు పొడిగింపు. గతంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు సెప్టెంబర్ 16వరకు గడువు ఉండగా.. తాజాగా దానిని అక్టోబర్ 7 వరకు పొడిగించారు. అదేవిధంగా వాటి పరిష్కారానికి గతంలో అక్టోబర్ 15 వరకు ఉన్న గడువును నవంబర్ 5 వరకు పెంచారు. దీంతో తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి నవంబర్ 9కు మారింది.

**మూడోసారి షెడ్యూల్ పొడిగింపు**

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ జూన్ 25న ప్రారంభమైంది. ప్రక్రియలో భాగంగా ఇంటింటి ఓటర్ల వివరాల సేకరణ, పాత ఓటర్ల జాబితాలతో వివరాల అనుసంధానం, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల సమాచార పరిశీలన వంటి కార్యక్రమాలు చేపట్టారు. వివిధ దశల్లో ఎదురైన పరిపాలనా, సాంకేతిక అంశాల నేపథ్యంలో గతంలోనూ కొన్ని గడువులను సవరించారు.
తాజా నిర్ణయంతో క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలు దశకు మరోసారి అదనపు సమయం లభించింది. దీంతో ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులు, తమ వివరాల్లో తప్పులు ఉన్నవారు, చిరునామా లేదా ఇతర వివరాల్లో మార్పులు చేయించుకోవాల్సిన వారు తమ దరఖాస్తులను సమర్పించేందుకు అవకాశం ఏర్పడింది.

**ఓటర్లకు మరో అవకాశం**

ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడంతో.. ప్రతి ఓటరూ తమ పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. పేరు ఉన్నప్పటికీ వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేయించుకోవచ్చు. అర్హత ఉన్నప్పటికీ పేరు నమోదు కాకపోతే నిర్ణయించిన విధానంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.అదేవిధంగా ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్లు నమోదైనట్లు భావించినా, ఒకే వ్యక్తి పేరుతో బహుళ నమోదులు ఉన్నట్లు గుర్తించినా లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నా నిబంధనల ప్రకారం అభ్యంతరాలు దాఖలు చేయవచ్చు. అందువల్ల గడువు ముగిసే వరకు వేచి ఉండకుండా తమ వివరాలను ముందుగానే పరిశీలించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**వివరాల పరిశీలనకు ప్రత్యేక ప్రక్రియ**

ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఓటర్ల ప్రస్తుత వివరాలను గతంలో ఉన్న ఓటర్ల జాబితాలతో సరిపోల్చి పరిశీలిస్తున్నారు. వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో సంబంధిత ఓటర్ల నుంచి వివరణలు, ఆధారాలు కోరే ప్రక్రియ కొనసాగుతోంది. అవసరమైన చోట నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహిస్తున్నారు.పెద్ద సంఖ్యలో నమోదులను పరిశీలించాల్సి ఉండటం, అభ్యంతరాలు మరియు క్లెయిమ్‌లను నిబంధనల ప్రకారం పరిష్కరించాల్సి ఉండటంతో అధికారులు అదనపు సమయాన్ని వినియోగించుకోనున్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించిన తర్వాతే తుది ఓటర్ల జాబితాలో మార్పులు చేయనున్నారు.

**ప్రజల భాగస్వామ్యం కీలకం**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకమని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హత ఉన్న ప్రతి వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను గుర్తించడం ఈ ప్రక్రియలో ప్రధాన లక్ష్యంగా ఉంది.

రాజకీయ పార్టీలు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఎన్నికల సంఘం సూచించింది. పోలింగ్ కేంద్రాల స్థాయిలో పార్టీలు తమ ప్రతినిధులను అందుబాటులో ఉంచి ఓటర్ల జాబితాను పరిశీలించడంతో పాటు అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు అయ్యేలా సహకరించాలని కోరింది.

**అక్టోబర్ 7 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు**

తాజా షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అనంతరం వాటిపై అవసరమైన నోటీసులు, విచారణ, ధ్రువీకరణ, పరిష్కార ప్రక్రియను నవంబర్ 5లోపు పూర్తి చేయనున్నారు.ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం నవంబర్ 9న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. దీంతో ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు లేదా సవరణలు కోరుతున్న వారికి మరో కీలక అవకాశం లభించినట్లయింది.

**తుది జాబితాపై స్పష్టత**

అర్హత ఉన్నప్పటికీ ఓటర్ల జాబితాలో పేరు లేని వారు, తమ పేరు లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నవారు, జాబితాలోని నమోదులపై అభ్యంతరాలు ఉన్నవారు ఈ గడువును సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.తాజా షెడ్యూల్‌తో తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియకు మరింత సమయం లభించింది. అక్టోబర్ 7 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు.. నవంబర్ 5లోపు వాటి పరిష్కారం.. నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా ప్రచురితం కానుంది. దీంతో రాష్ట్రంలోని ఓటర్లు తమ పేర్లు, వివరాలను మరోసారి పరిశీలించుకుని అవసరమైన సవరణలు, దరఖాస్తులు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా సమర్పించుకోవాల్సిన అవసరం ఉంది.



# కేసీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుతారు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నీళ్ళ విషయంలో కేసీఆర్ కు నాలెడ్జ్ లేదు

**హైదరాబాద్, మహా :** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుతారని సెటైర్లు గుప్పించారు. కూలిపోయిన కాళేశ్వరం దగ్గరకు సిగ్గు లేకుండా ఎలా పోతారు.? అని ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీ మీడియా హాల్లో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు. నీళ్ల సమస్యకు రెండే కారణాలు ఉన్నాయని తెలిపారు. కేసీఆర్, ఎల్‌నినో రెండు కారణాలతోనే నీళ్ల సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. నీళ్ల విషయంలో కేసీఆర్‌కి నాలెడ్జ్ లేదని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. కేసీఆర్ ఇంట్లో పడుకుంటే బెటర్ అని హితవు పలికారు. అసభ్య వ్యాఖ్యల విషయంలో కేసీఆర్‌దే తప్పు అని చెప్పారు. కేసీఆర్ అనుచితంగా మాట్లాడినప్పుడు హీరోలాగా ఫీల్ అయ్యారని వ్యంగ్యంగా మాట్లాడారు. కేసీఆర్ మాట్లాడిన భాషను ఆయనపై ఉపయోగిస్తే నానా యాగీ ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్ తప్పులు చేశారని విమర్శించారు. ఇరిగేషన్ శాఖను నాశనం చేసింది కేసీఆరే అని విమర్శించారు. లక్ష కోట్ల రూపాయలు పెట్టి కాళేశ్వరం కట్టారని అన్నారు. ఈ ప్రాజెక్టు సరిగా కడితే ఈ సమస్య ఉండకపోయేది కదా అని నిలదీశారు. బీజేపీకి సరెండర్ అయితే తామేం చేస్తామని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయడానికి అడ్డుకుంది ఎవరు? అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి

- రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాకలెక్టర్ సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి ఎ.ఈ.ఆర్.ఓ.లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్2026 లో భాగంగా జిల్లాలో 1 లక్షా 70 వేల మ్యాపింగ్ కాని, అనమోలీస్ ఓటర్లకు సంబంధిత నోటీసులు అందజేసినట్లు చెప్పారు.ఇలా విడుదల జేసిన 1 లక్షా 10 వేల నోటీసులు పంపిణీ చేసి, మిగిలిన 60 వేల నోటీసులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 3 ఈ.ఆర్.ఓ. లు, 18 ఎ.ఈ.ఆర్.ఓ.లు, అదనంగా కేటాయించబడిన 18 ఎ.ఈ.ఆర్.ఓ.లు ఎస్ ఐ ఆర్ సంబంధిత క్లెయిమ్స్, అబ్జెక్షన్ ప్రక్రియపై పని చేస్తున్నారని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని, నోటీసులు జారీ అయిన ప్రతి ఒక్కరు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన 11 డాక్యుమెంట్లలో నుంచి మాత్రమే సంబంధిత ఓటర్లు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు నోటీసుల జారీ, సంబంధిత డాక్యుమెంట్ల సమర్పణ తదితర అంశాలపై మరొకసారి శిక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నో మ్యాపింగ్, అనమోలీస్, ఎ.ఎస్.డి. జాబితాను సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్లకు అందించాలని, బూత్ స్థాయి అధికారులు నోటీసులు జారీ అయిన ఓటర్లు సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ కూడా ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అంతకుముందు జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల సింగరేణి అతిథి గృహానికి చేరుకున్న విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా ను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం నస్పూర్ లో గల 250, 251, 252, 253 పోలింగ్ కేంద్రాలను సందర్శించి సంబంధిత బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోలేరు

- హైకోర్టు కీలక ఆదేశాలు.
- మహిళా ఎమ్మెల్యేలపై దురుసు ప్రవర్తనపై సీరియస్.
- సభలో సభ్యులు తప్పు చేస్తే స్పీకరే చర్యలు తీసుకోవాలి: తెలంగాణ హైకోర్టు

**హైదరాబాద్: మహా :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజు అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలు, పోలీసుల తీరుపై వివాదం ముదిరిన నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు జోక్యం చేసుకుంది. శాసనసభ, శాసనమండలి సమావేశాలకు హాజరయ్యే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ప్రజాప్రతినిధులు తమ విధులకు హాజరవుతున్న సమయంలో పోలీసుల జోక్యం సరికాదని తేల్చిచెప్పింది.
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించడంతో ఈ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. అసెంబ్లీ, మండలి సమావేశాలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోరాదని కోర్టు స్పష్టం చేసినట్లు సమాచారం. శాసనసభ్యులు సభకు హాజరయ్యే హక్కును పోలీసులు తమ చర్యల ద్వారా నిరోధించకూడదని పేర్కొంది.
సభలో సభ్యులు ఏదైనా నిబంధన ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు మాత్రమే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. శాసనసభ్యులపై పోలీసులు స్వయంగా చర్యలు తీసుకునే అధికారం లేదని పేర్కొన్నట్లు సమాచారం. సభా వ్యవహారాలు, సభ్యుల ప్రవర్తనకు సంబంధించిన అంశాల్లో శాసనసభా నియమాలు, స్పీకర్ అధికారాలే కీలకమని ధర్మాసనం స్పష్టం చేసింది.
అసెంబ్లీ సమావేశాల తొలిరోజు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చిన సమయంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. నినాదాలతో కూడిన టీషర్టులతో అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్లేందుకు పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు.

**మహిళా ఎమ్మెల్యేలపై ఘటనపై తీవ్ర ఆగ్రహం**

నిరసనల సందర్భంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారన్న ఆరోపణలను హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. మహిళా ప్రజాప్రతినిధులపై దాడి లేదా అనుచితంగా ప్రవర్తించిన పోలీసు సిబ్బందిని గుర్తించాలని ఆదేశించింది. బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించినట్లు సమాచారం.
మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల ప్రవర్తనకు సంబంధించిన అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఘటనకు సంబంధించిన వివరాలను కోర్టు ముందుంచాలని ప్రభుత్వ తరఫు న్యాయవాదికి నోటీసులు జారీ చేసింది.
ప్రజాప్రతినిధుల విధులకు ఆటంకం కలిగించే విధంగా పోలీసులు వ్యవహరించకూడదని కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో అసెంబ్లీ పరిసరాల్లో జరిగిన పరిణామాలపై రాజకీయంగా మరింత చర్చ మొదలైంది. సభకు వెళ్లే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల విషయంలో పోలీసుల పాత్ర, శాసనసభ స్పీకర్ అధికారాలపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.
ఇరువైపుల వాదనలు విన్న అనంతరం ఈ కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటిలోగా ప్రభుత్వం ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది.అసెంబ్లీ సమావేశాల తొలిరోజే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య చోటుచేసుకున్న వివాదం రాజకీయ దుమారం రేపగా.. తాజాగా హైకోర్టు జోక్యంతో వ్యవహారం న్యాయస్థానం పరిధిలోకి వెళ్లింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభకు హాజరుకాకుండా పోలీసులు అడ్డుకోవడంపై కోర్టు స్పష్టమైన వైఖరి వ్యక్తం చేయడం, మహిళా ఎమ్మెల్యేలపై దురుసు ప్రవర్తనకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది.



# నందూస్ వరల్డ్ యూట్యూబర్ నందన అరెస్ట్

**ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగింత**

**హైదరాబాద్, మహా :** లండన్‌లో ఉద్యోగాలు, యూకే వీసా సేవలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ యూట్యూబర్ రామ నందనను శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుక్‌అవుట్ సర్క్యులర్ ఉండటంతో విమానాశ్రయంలో కదలికలను గుర్తించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు పోలీసులకు సమాచారం అందించినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. అనంతరం ఆమెను తదుపరి విచారణ కోసం ఆంధ్రప్రదేశ్‌లోని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించే ప్రక్రియ చేపట్టారు.
'నందూస్ వరల్డ్' పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తూ గుర్తింపు పొందిన రామ నందన, ఆమె భర్త జగర్లమూడి మధుకర్‌పై విదేశీ ఉద్యోగాలు, యూకే వీసా రెన్యూవల్, ఉద్యోగ నియామకానికి అవసరమైన సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామంటూ డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలపై కేసు నమోదైంది. ఈ కేసులో మధుకర్, రామ నందనతో పాటు మధుకర్ తండ్రి మోహన్‌రావు పేర్లు కూడా నమోదైనట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం, లండన్‌లో మంచి వేతనాలతో ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసా సంబంధిత సేవలు అందిస్తామని నమ్మించి పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నారన్నది ప్రధాన ఆరోపణ. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఒక ఫిర్యాదుదారు తాను వీసా రెన్యూవల్, ఉద్యోగం, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ కోసం విడతలవారీగా రూ.15 లక్షలు చెల్లించినట్లు ఆరోపించారు. తనకు ఇచ్చిన సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ నకిలీదని తేలిందని, అనంతరం డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా కొంత మొత్తమే తిరిగి ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.
ఈ వ్యవహారంపై కేసు నమోదైన అనంతరం నందన, మధుకర్‌లకు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. విదేశాల్లో ఉన్న ఈ దంపతులపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తుండగా.. తాజాగా నందన భారత్‌కు తిరిగి రావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

# డీఆర్‌వో మర్రి శ్రీదేవి ఘటనపై విచారణ జరపాలి : రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్ధన్

**విజయవాడ, మహా:** ఏలూరు జిల్లా డీఆర్‌వో మర్రి శ్రీదేవి పట్ల జరిగిన అనుచిత వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణజరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్ధన్ డిమాండ్ చేశారు. బాధ్యతలు నిర్వర్తించే అధికారులకు గౌరవప్రదమైన వాతావరణం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పు కాపు, మున్నూరుకాపు వర్గాలకు చెందిన ఉద్యోగులు ఎలాంటి వేధింపులు, ఒత్తిళ్లు లేకుండా విధులు నిర్వర్తించే పరిస్థితులు ఉండాలన్నారు.ఏలూరు జిల్లా డీఆర్‌వో మర్రి శ్రీదేవి పట్ల ఓ ఉన్నతాధికారి దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడినట్లు ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ ఘటన నేపథ్యంలో మర్రి శ్రీదేవి సెలవుపై వెళ్లడం విచారకరమని, రాష్ట్ర కాపు జేఏసీ ఈ వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. మహిళా అధికారుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఘటనలను ప్రభుత్వం ఉపేక్షించరాదన్నారు.ముఖ్యమంత్రి



రాష్ట్ర కాపు జే ఏ సీ అధ్యక్షులు చందు జనార్ధన్

చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, డీఆర్‌వో మర్రి శ్రీదేవి ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్, మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చందు జనార్ధన్ తెలిపారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- టీడీపీ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం.
- కూటమిలో సఖ్యతగా ఉండాలి.
- నేతల మధ్య గ్యాప్‌లు ఉండకూడదు.
- ప్రతి నియోజకవర్గంలో 25 ప్రాధాన్యతాంశాలు.
- ఎమ్మెల్యేలకు చంద్రబాబు టార్గెట్లు.



**అమరావతి, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవద్దని స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, సఖ్యత అత్యంత కీలకమని.. పార్టీలోని నేతల మధ్య ఎలాంటి గ్యాప్‌లు లేకుండా కలిసి పనిచేయాలని సూచించారు.టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై చంద్రబాబు ప్రత్యేకంగా చర్చించారు. రానున్న ఎన్నికల్లో గెలుపు సాధించడంపైనే తన ధ్యాస, ఆలోచన అంతా ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఈ సానుకూలత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల రూపంలో ప్రతిఫలించాలని ఆకాంక్షించారు.
ముఖ్యంగా మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వచ్చే స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై ముందుగానే దృష్టి సారించాలని చంద్రబాబు సూచించారు. ఆయా స్థానాలకు సమర్థవంతమైన మహిళా నేతలను ముందుగానే గుర్తించాలని పార్టీ నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల ఎంపికలో సామర్థ్యం, ప్రజల్లో ఉన్న ఆదరణ, పార్టీతో అనుబంధం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**2029లో మరింత మెరుగైన ఫలితాలు**

2029 అసెంబ్లీ ఎన్నికల్లో 2024 ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజలకు చేరువగా ఉండటం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఎన్నికల విజయానికి ఇప్పటి నుంచే పునాది వేయాలని నేతలకు సూచించారు.
పరిపాలనతో పాటు పార్టీ వ్యవహారాలకు కూడా ప్రతిరోజూ సమయం కేటాయిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, పార్టీ బలోపేతం రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న సానుకూలతను నిలబెట్టుకోవడంతో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సూచించారు.

**ఎమ్మెల్యేలకు 25 అంశాల టార్గెట్**

రాష్ట్రంలో ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేస్తూ అభివృద్ధి పనులను వేగంగా చేపడుతున్నామని చంద్రబాబు చెప్పారు. స్పష్టమైన టార్గెట్లు పెట్టుకుని పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఇదే విధంగా ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల్లో స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలని సూచించారు.
ప్రతి నియోజకవర్గంలో 25 ప్రాధాన్యతాంశాలను గుర్తించాలని ఎమ్మెల్యేలకు చంద్రబాబు సూచించారు. స్థానిక అవసరాలు, అభివృద్ధి లోటుపాట్లు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఈ అంశాల ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తే ప్రజల్లో ఎమ్మెల్యేలకు గుర్తింపు, గౌరవం లభిస్తుందని అన్నారు.ప్రజలకు కనిపించేలా, వారికి నేరుగా ఉపయోగపడేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని చంద్రబాబు సూచించారు. నియోజకవర్గానికి అవసరమైన అంశాలను గుర్తించి వాటిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. అభివృద్ధి పనుల ఫలితాలు ప్రజలకు అందితేనే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం మరింత బలపడుతుందని స్పష్టం చేశారు.

**మూడు నెలలకోసారి లీడర్‌షిప్ సమావేశం**

టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ తరహా సమావేశాలను ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని చంద్రబాబు నిర్ణయించారు. ప్రభుత్వం, పార్టీ పనితీరును సమీక్షించడంతో పాటు క్షేత్రస్థాయిలో నేతలు అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇతర నియోజకవర్గాలకు పరిచయం చేయాలని సూచించారు.
ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను తదుపరి లీడర్‌షిప్ సమావేశంలో ప్రదర్శించాలని చంద్రబాబు సూచించారు. ఒక నియోజకవర్గంలో విజయవంతంగా అమలవుతున్న విధానాలను ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేసేలా పరస్పర అనుభవాలను పంచుకోవాలని చెప్పారు.

### నడిపిన సభలోనే.. నిలిచిన పేరు

# శాసనసభకు శ్రీపాద గౌరవం

**సెంట్రల్ హాల్‌కు మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు**

కొన్ని పేర్లు చరిత్రలో నిలిచిపోతాయి.. మరికొన్ని పేర్లే చరిత్రకు గౌరవం తెస్తాయి. మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు అలాంటి అరుదైన ప్రజానాయకుడు. ప్రజల కష్టాలను తనవిగా భావించి శాసనసభలో గళమెత్తిన ఆయన.. సభా నిబంధనలను ఆయుధంగా, ప్రజాస్వామ్యాన్ని బాధ్యతగా భావించి స్పీకర్ పదవికి ప్రత్యేక గౌరవం తెచ్చారు. ఒకప్పుడు తన నిష్పాక్షిక నిర్ణయాలతో సభను నడిపించిన ఆ నాయకుడి పేరు ఇప్పుడు అదే శాసనసభలోని నూతన సెంట్రల్ హాల్‌కు పెట్టడం ఆయన ప్రజా జీవితానికి లభించిన చారిత్రక గౌరవంగా నిలిచింది.

ఇది ఒక హాల్‌కు పేరు పెట్టిన కార్యక్రమం మాత్రమే కాదు.. ప్రజల కోసం పలికిన గొంతుకు, ప్రజాస్వామ్య విలువలను కాపాడిన వ్యక్తిత్వానికి, శాసనసభా సంప్రదాయాలను గౌరవించిన నాయకత్వానికి లభించిన శాశ్వత గుర్తింపు. ఒకప్పుడు స్పీకర్ కుర్చీలో కూర్చొని సభను నడిపించిన శ్రీపాదరావు.. ఇప్పుడు అదే సభలోని సెంట్రల్ హాల్ ద్వారా ప్రతి రోజూ గుర్తుకు రానున్నారు.

**ప్రజల మధ్య పుట్టిన ప్రజా నాయకత్వం**

1937 నవంబర్ 6న దుద్దిళ్ల రాధాకృష్ణయ్య, కమలాభాయి దంపతులకు జన్మించిన శ్రీపాదరావు బి.ఎస్సీ, ఎల్.ఎల్.బి విద్యను అభ్యసించారు. స్వగ్రామం ధన్వాడ నుంచే ప్రజాసేవకు శ్రీకారం చుట్టారు. వరుసగా మూడుసార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికై గ్రామ ప్రజల నమ్మకాన్ని పొందారు. గ్రామస్థాయి నుంచి ప్రారంభమైన ఆయన ప్రజా ప్రస్థానం.. మంథని భూతనఖా బ్యాంక్ చైర్మన్, మహాదేవ్‌పూర్ సమితి ఉపాధ్యక్షుడి వరకు సాగింది. ప్రజల మధ్య పని చేసిన అనుభవం.. వారి కష్టాలను దగ్గరగా చూసిన అనుభూతి.. తర్వాతి రాజకీయ జీవితానికి బలమైన పునాదిగా మారాయి.

**మంథని నుంచి శాసనసభకు..**

1983లో తొలిసారి మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీపాదరావు.. 1984, 1989 ఎన్నికల్లోనూ వరుస విజయాలు సాధించారు. కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ విప్‌గా, రీజినల్ టొబాకో బోర్డు సభ్యుడిగా, పలు శాసనసభా కమిటీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు.ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన నియోజకవర్గ సమస్యలతో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రజల ఇబ్బందులను శాసనసభలో ప్రస్తావించారు. పదవులు ఆయన రాజకీయ జీవితాన్ని పరిచయం చేస్తే.. ప్రజల కోసం ఆయన పలికిన మాటలు ఆయన వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తాయి.

**స్పీకర్ కుర్చీకి కొత్త గౌరవం..**

1991 ఆగస్టు 19న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా శ్రీపాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1995 జనవరి 11 వరకు ఆ పదవిలో కొనసాగారు. స్పీకర్ కుర్చీని ఆయన అధికారానికి ప్రతీకగా చూడలేదు. అది ప్రజాస్వామ్యానికి అప్పగించిన బాధ్యతగా భావించారు. సభా నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఆయన రూల్ బుక్‌ను తన నిర్ణయాలకు ప్రాతిపదికగా చేసుకున్నారు.

అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా సభా నియమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్, రూలింగ్స్ విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు శాసనసభా వ్యవహారాల్లో ప్రత్యేక ముద్ర వేశాయి. ప్రతిపక్ష సభ్యుల హక్కులను గౌరవిస్తూ.. సభా గౌరవాన్ని కాపాడుతూ వ్యవహరించిన నిష్పాక్షిక స్పీకర్‌గా ఆయన పేరు నిలిచిపోయింది.

**ప్రజల గుండె చప్పుడు..**

**శ్రీపాద వాణి**

శ్రీపాదరావు శాసనసభలో మాట్లాడినప్పుడు ఆయన ముందున్నది రాజకీయ ప్రత్యర్థి కాదు.. ప్రజల సమస్య. గోదావరి పరివాహక ప్రాంత రైతుల సాగునీటి సమస్యలు, ఉత్తర తెలంగాణ కరువు పరిస్థితులు, దళిత-బహుజన, పేద వర్గాల ఆవేదన, నిరుద్యోగం, నక్సలైట్ సమస్య వంటి అనేక అంశాలను ఆయన సభ ముందుంచారు. ఆయన ప్రసంగాల్లో ఆవేశం ఉండేది.. కానీ ఆ ఆవేశానికి వెనుక అధ్యయనం ఉండేది. ప్రశ్నించడంలో పదును ఉండేది.. కానీ ఆ ప్రశ్న వెనుక ప్రజా ప్రయోజనం ఉండేది. అందుకే ఆయన ప్రసంగాలు కేవలం రాజకీయ ప్రసంగాలుగా కాకుండా.. ఆ కాలం ప్రజల జీవన సమస్యలకు అద్దం పట్టిన శాసనసభా దస్తావేజులుగా నిలిచాయి.

**అక్షర రూపంలో 'ప్రజల పక్షాన శ్రీపాద వాణి'**

శ్రీపాదరావు శాసనసభా ప్రసంగాలు ఇప్పుడు 'ప్రజల పక్షాన శ్రీపాద వాణి' పేరుతో గ్రంథరూపంలోకి వస్తున్నాయి. ఎమెస్కో ప్రచురణగా రూపొందుతున్న ఈ సంకలనం ఆయన శాసనసభా ఆలోచనలు, ప్రజా సమస్యలపై ఆయన దృక్పథం, సభా వ్యవహారాలపై ఆయనకున్న పట్టు వంటి అంశాలను భవిష్యత్ తరాలకు అందించనుంది. మైకు దొరికిన వెంటనే ఎంత గట్టిగా మాట్లాడామన్నది కాదు.. మాట వెనుక



ఎంత విషయ పరిజ్ఞానం, ఎంత ప్రజా ప్రయోజనం ఉందన్నదే ముఖ్యమని ఆయన ప్రసంగాలు నేటి తరానికి చెబుతున్నాయి.

**అర్ధరాత్రి తలుపు తట్టినా..**

ప్రజా జీవితంలో ఎంతటి ఉన్నత పదవులు చేపట్టినా.. సామాన్యుడికి దూరం కాకపోవడం శ్రీపాదరావు ప్రత్యేకత. "అర్ధరాత్రి తలుపు కొట్టినా స్పందించే నాయకుడు" అన్న విశ్వాసం ఆయనకు ప్రజల్లో ఉండేది. మంథనితో ఆయనకున్న అనుబంధం కేవలం రాజకీయ సంబంధం కాదు.. ఆత్మీయ బంధం.

సతీమణి జయశ్రీ,నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలతో కూడిన కుటుంబంలో మంథనితో ఉన్న ఆత్మీయ బంధాన్ని చివరివరకు శ్రీపాదరావు వీడలేదు 1999 ఏప్రిల్ 13న 62 వ ఏట నక్సలైట్ల చేతిలో ఆయన హత్యకు గురయ్యారు. జీవితం అర్ధాంతరంగా ముగిసినా.. ప్రజలతో ఆయనకున్న అనుబంధం, ప్రజాస్వామ్యంపై ఆయనకున్న నిబద్ధత, శాసనసభలో ఆయన వేసిన ముద్ర మాత్రం కాలంతో చెరిగిపోలేదు.

**తండ్రీ బాటలో తనయుడు..**

దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు చూపిన ప్రజాసేవా బాటలోనే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముందుకు సాగుతున్నారు. శ్రీధర్ బాబు ప్రస్తుతం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన పదవి మాత్రమే కాదు.. ప్రజల పట్ల నిబద్ధత, సౌమ్యమైన వ్యవహారశైలి, విషయ పరిజ్ఞానంతో కూడిన నాయకత్వాన్ని తన రాజకీయ ప్రస్థానంలో కొనసాగిస్తున్నారు.

శ్రీపాదరావు ప్రజల సమస్యలను శాసనసభలో బలంగా వినిపించినట్లే.. శ్రీధర్‌బాబు కూడా ప్రజా సమస్యలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి, పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన శ్రీధర్‌బాబు.. 'తండ్రికి తగ్గ తనయుడు' అనే గుర్తింపును నిలబెట్టుకుంటున్నారు.

పేరు పెట్టింది హాల్‌కు..
నిలిచింది ఓ విలువ
ఇప్పుడు తెలంగాణ శాసనసభలోని నూతన సెంట్రల్ హాల్‌కు దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టడం ఆయన సేవలకు లభించిన అపూర్వ గౌరవం.
శాసనసభను నడిపించిన వ్యక్తి పేరు.. అదే శాసనసభలోని కీలక ప్రాంగణానికి చిరునామా కావడం అరుదైన సందర్భం.
ఇది కేవలం పేరు కాదు..
ప్రజల గొంతుకకు గౌరవం.
నిష్పాక్షికతకు గౌరవం.
శాసనసభా సంప్రదాయాలకు గౌరవం.
ప్రజాస్వామ్య విలువలకు గౌరవం.
ఒకప్పుడు స్పీకర్‌గా సభను నడిపించారు..
ఇప్పుడు అదే సభలో ఓ ప్రాంగణంగా నిలిచారు.
మాటలతో ప్రజల మనసుల్లో నిలిచిన శ్రీపాదరావు..
ఇప్పుడు తన పేరుతో శాసనసభలో శాశ్వతంగా నిలిచారు.
నడిపిన సభలోనే.. నిలిచిన పేరు
శాసనసభకు శ్రీపాద గౌరవం.



- గొట్టిముక్కుల బ్రహ్మచారి
సీనియర్ జర్నలిస్టు
9441884389



# రణరంగంగా.. తెలంగాణ అసెంబ్లీ

తోపులాటలు.. బూతులు.. దాడులు
ఫిర్యాదులు..కన్నీళ్ళు
(మహా నెట్ వర్క్ ) తెలంగాణ అసెంబ్లీ
సోమవారం రణరంగాన్ని తలపించింది.

బూతులు, తోపులాటలు, దాడులు, ఆవేశకావేశాలు, గాయాలు, విమర్శలు, ఫిర్యాదులతో దద్దరిల్లింది. విమర్శలు, ప్రతివిమర్శలు దాటి మంగళవారం పలువరు సభ్యులు సభ్యత్వం

కోల్పేయే స్థాయిలో సభా ప్రాంగణంలో దారుణ సంఘటనలు మునుపెన్నడూ
జరగని రీతిలో
చోటుచేసుకున్నాయి.










### మోదీ కార్యక్రమానికి భారీ క్రేజ్..

# గంటలోనే సీట్లన్నీ బుక్

- 42 వేల మందికి పైగా వెయిటింగ్ లిస్ట్.
- క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ ఎంట్రీ.
- వడోదరలో రూ.35 వేల కోట్లకుపైగా ప్రాజెక్టులు.



**వడోదర,మహా :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం గుజరాత్‌లోని వడోదరలో పాల్గొననున్న భారీ బహిరంగ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. తొలిసారిగా ప్రధానమంత్రి కార్యక్రమానికి ప్రజల ఉచిత భాగస్వామ్యాన్ని బుక్‌మైషో ద్వారా డిజిటల్ విధానంలో నమోదు చేసుకునే అవకాశం కల్పించగా.. రిజిస్ట్రేషన్లు ప్రారంభమైన గంటలోపే అందుబాటులో ఉన్న సీట్లన్నీ పూర్తిగా బుక్ అయ్యాయి. ఆ తర్వాత కూడా భారీ సంఖ్యలో ప్రజలు రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించడంతో 42 వేల మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో చేరారు.వడోదరలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రవేశం నుంచి సీటింగ్ వరకు మొత్తం ప్రక్రియను డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి వారి బుక్‌మైషో ఖాతాలో డిజిటల్ ఎంటికెట్ అందుతుంది. అందులో సురక్షితమైన లైవ్ క్యూఆర్ కోడ్ ఉంటుంది. వేదిక వద్ద ఆ కోడ్‌ను స్కాన్ చేసి ప్రవేశాన్ని ధ్రువీకరిస్తారు. రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, ప్రవేశం, సీటింగ్ ప్రక్రియను సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించడం ద్వారా భారీ జనసందోహం మధ్య క్యూలు, రద్దీని తగ్గించేందుకు ఏర్పాట్లు చేశారు.

వడోదరలోని మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీ పావిలియన్ గ్రౌండ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారిక సమాచారం ప్రకారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో రూ.35 వేల కోట్లకుపైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కీలకం**

మోదీ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ నిలవనుంది. మొత్తం 326 రూట్ కిలోమీటర్ల మేర విస్తరించిన మూడు కీలక విభాగాలను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. ఈ మూడు విభాగాల అభివృద్ధికి రూ.20,700 కోట్లకుపైగా వ్యయం చేసినట్లు కేంద్రం తెలిపింది. న్యూ సానంద్ (ఉత్తర)మకర్పుర, న్యూ ఉంబర్‌గావ్‌న్యూ సఫాలే, న్యూ సఫాలేజేఎన్‌పీటీ విభాగాలు ఇందులో ఉన్నాయి.ఈ విభాగాలు అందుబాటులోకి రావడంతో జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీకి నేరుగా సరుకు రవాణా అనుసంధానం బలోపేతం కానుంది. పరిశ్రమల కేంద్రాలు, పోర్టుల మధ్య ఎగుమతి, దిగుమతి సరుకు రవాణా వేగవంతం కావడంతో పాటు రవాణా సమయం, లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. ముంబై రైల్వే నెట్‌వర్క్‌పై ఉన్న సరుకు రవాణా ఒత్తిడిని తగ్గించడంలోనూ ఈ కారిడార్ కీలక పాత్ర పోషించనుంది.కొత్తగా అభివృద్ధి చేసిన ఫ్రైట్ కారిడార్ మార్గాల్లో న్యూ సానంద్ (నార్త్), న్యూ మకర్పుర, న్యూ ఉంబర్‌గావ్, న్యూ జేఎన్‌పీటీ నుంచి సరుకు రైళ్ల సేవలను కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. దీంతో పశ్చిమ భారత పారిశ్రామిక ప్రాంతాలు, పోర్టుల మధ్య సరుకు రవాణా వ్యవస్థ మరింత సమర్థంగా మారనుంది.

**కొత్త రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన**

ఫ్రైట్ కారిడార్‌తో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో రైల్వే అనుసంధానాన్ని మెరుగుపరిచే పలు ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ప్రయాణికుల రాకపోకలు, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడం, రైల్వే మార్గాల్లో రద్దీని తగ్గించడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యంగా ఉంది.

వడోదర పర్యటనలో భాగంగా కొత్త రైల్వే సేవలను కూడా ప్రారంభించనున్నారు. అలాగే చోటా ఉదేపూర్‌ధార్ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేసిన జోబట్‌టాండా రోడ్ కొత్త రైల్వే లైన్‌ను జాతికి అంకితం చేయనున్నారు. ఈ మార్గం అలీరాజ్‌పూర్ వంటి మారుమూల, గిరిజన ప్రాంతాలను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించనుంది.

**హైవేలపైనా భారీ పెట్టుబడులు**

రైల్వే రంగంతో పాటు జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులకు కూడా ఈ పర్యటనలో ప్రాధాన్యం లభించనుంది. సుమారు రూ.1,780 కోట్ల విలువైన మూడు హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీటిలో ఎన్‌హెచ్ 48లో కామ్రేజ్‌చల్తాన్ మార్గాన్ని ఆరు లేన్లుగా విస్తరించడం, వడోదరసూరత్ మార్గంలో నదులపై అదనపు వంతెనల నిర్మాణం, ఎన్ హెచ్ 53లో కీలక జంక్షన్ల వద్ద గ్రేడ్ సెపరేటెడ్ నిర్మాణాలు ఉన్నాయి .ఈ రహదారి ప్రాజెక్టులు పూర్తయితే గుజరాత్‌లో పారిశ్రామిక ప్రాంతాలు, నగరాలు, పోర్టుల మధ్య రవాణా మరింత సులభతరం కానుంది. రహదారులపై రద్దీ తగ్గడంతో పాటు సరుకు రవాణా వేగం పెరిగే అవకాశం ఉంది.

**ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్**

వడోదర కార్యక్రమం అనంతరం ప్రధాని మోదీ మహారాష్ట్రలోని ముంబైకి వెళ్లనున్నారు. సాయంత్రం సుమారు 5.45 గంటలకు గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026ను ప్రారంభించి ప్రసంగించనున్నారు. ఒకవైపు రూ.35 వేల కోట్లకుపైగా విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం, మరోవైపు ప్రధానమంత్రి కార్యక్రమానికి ప్రజల ప్రవేశాన్ని పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించడం వడోదర పర్యటనలో ప్రత్యేకతగా నిలుస్తోంది. రిజిస్ట్రేషన్లు ప్రారంభమైన గంటలోనే సీట్లన్నీ బుక్ కావడం, 42 వేల మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో చేరడం కార్యక్రమంపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని స్పష్టంగా చూపిస్తోంది.

# శాసనసభ కాదు.. దుశ్శాసనసభ

**రేవంత్ సర్కారుపై కేటీఆర్ ధ్వజం**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం, నిరసనలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు కిరాతకంగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభను కాంగ్రెస్ ప్రభుత్వం 'దుశ్శాసన సభ'గా మార్చివేసిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన పోలీస్ బృందం కిరాతకంగా వ్యవహరించాయని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ఎంత రెచ్చగొట్టినా ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరించాలని తమ అధినేత కేసీఆర్ సూచించారని కేటీఆర్ తెలిపారు. నాడు పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ టీషర్టులు ధరించి నిరసన తెలిపిన తరహాలోనే తాము కూడా అసెంబ్లీకి వెళ్లామని స్పష్టం చేశారు. అజాత శత్రువులుగా పేరున్న మాజీ మంత్రులు, మహిళా




ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై పోలీసులు ప్రవర్తించిన తీరును సమాజం నిశితంగా గమనించిందని అన్నారు. అసలు ఏ రూల్ ప్రకారం తమను అడ్డుకున్నారో చెప్పడానికి అధికారుల వద్ద సమాధానం లేదన్నారు. టీషర్టులపై ఎలాంటి అభ్యంతరకర పదాలు లేవని, అలా ఉన్నాయని అనడానికి డీసీపీ శిల్పవల్లి ఎవరని నిలదీశారు. రేవంత్ రెడ్డిని నిలదీస్తామనే భయంతోనే తమను అడ్డుకున్నారని, ఆ తర్వాత ఈ అంశాన్ని డైవర్ట్ చేయడానికి కొత్త నాటకాలకు తెరలేపారని ఆరోపించారు. సభలో జరిగిన గలాటాకు ఆద్యుడు ముఖ్యమంత్రేనని కేటీఆర్ విమర్శించారు. 'వలువలు విప్పుతా' అని మాట్లాడిన ముఖ్యమంత్రి ఈరోజు విలువల గురించి మాట్లాడటం, అసెంబ్లీలో బూతులు మాట్లాడే రేవంత్ రెడ్డి నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో డీ.కే. అరుణకు తాను, జగదీష్ రెడ్డి క్షమాపణలు చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడు సభలో జరిగిన ఘటనకు రేవంత్ రెడ్డి స్పందించి క్షమాపణ చెప్పే వరకు వదిలిపెట్టేది లేదని, సభలో నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. సర్వభ్రష్ట ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్న రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.




# ఉద్యమకారులను గుర్తించాలని ప్రజావాణిలో దరఖాస్తు అందజేత

- **సంగిశెట్టి క్రిస్టఫర్ జోగు అంజయ్య మలిదశ ఉద్యమకారులు**

**వలిగొండ సెప్టెంబర్ 7 మహాన్యూస్** స్వరాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించాలని వలిగొండలో ప్రజావాణిలో దరఖాస్తు అందజేసిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య లు సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు అంద చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సంక్షేమం గుర్తింపు పట్ల క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఉద్యమకారులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉందని కానీ ప్రత్యేక వెబ్సైటు ప్రారంభించాలని కాలయాపన చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు ప్రత్యేక వెబ్సైట్ ఎప్పుడు ప్రారంభిస్తారని ఉద్యమకారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారని వారు అన్నారు ఉద్యమకారుల సంక్షేమం ఆత్మగౌరవం కోసం ప్రభుత్వం పనిచేయాలని తొందరగా ఉద్యమకార్లను గుర్తించాలని వారు డిమాండ్ చేశారు

# దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బి ఆర్ ఎస్ అహంకారానికి నిదర్శనం

- **వేముల వీరేశం ప్రభుత్వ విప్**



**హైదరాబాద్ సెప్టెంబర్ 7 మహా** : దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బిఆర్ఎస్ అహంకారం నిదర్శనమని ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు రాజ్యాంగ బద్ధమైన అత్యున్నత గౌరవం కలిగిన స్పీకర్ పదవిలో ఉన్న దళిత నాయకుడిని ఉద్దేశించి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలను వేముల వీరేశం తీవ్రంగా ఖండించారు దళిత వర్గానికి చెందిన స్పీకర్ను లక్ష్యంగా చేసుకొని అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని యావ దళిత సమాజం ఆత్మగౌరవం దెబ్బతీయటమే నని వారన్నారు కేసీఆర్ దళితుల మీదకు ఉసిగొలుపుతున్నారని వీరేశం అన్నారు రాజకీయ విమర్శలు పేరుతో హద్దులు దాటి మాట్లాడడం సరికాదని పదవుల్లో ఉన్న వ్యక్తుల గౌరవాన్ని కాపాడేసిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపై ఉందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ సభ్యత్వాన్నిరద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు ఇకపై ఇలాంటి అవమానకరమైన వ్యాఖ్యలు కొనసాగితే ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు ప్రజాస్వామ్య విలువలు రాజ్యాంగం గౌరవం దళితుల ఆత్మగౌరాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందని వేముల వీరేశం స్పష్టం చేశారు.

# విద్యార్థుల కోసం పోరాడితే అరెస్టులా?

**ఇదేనా ప్రజాపాలన?**

**పెద్దపల్లి మహా, సెప్టెంబర్ 7,**




ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న బీజేపీ జిల్లా నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు.విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు."మమ్మల్ని అరెస్ట్ చేయగలరు...కానీ విద్యార్థుల గొంతును అరెస్ట్ చేయలేరు!" విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి తెలంగాణ నాయకులు , బీజేపీ పెద్దపల్లి నందు నాయకులు , కందుల సంధ్య రాణి పోచమ్మ, రామగుండము , గోదావరిఖని బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ , నుండి అంగలి సంతోష్ తదితరులు పాల్గొని విద్యార్థుల హక్కుల కోసం తమ గళాన్ని వినిపించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు

- **-ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన ఏఏఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం**
- **-రన్‌వే విమానాల అప్రోచ్ ఫన్నెల్ నైట్ ల్యాండింగ్‌పై సాంకేతిక అధ్యయనం**
- **-రైల్వే లైన్ వల్ల కలిగే సాంకేతిక అంశాలపై ప్రత్యేక పరిశీలన**
- **-సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి కీలకమైన ముందడుగు పడింది. విమానాశ్రయ ఏర్పాటుకు గుర్తించిన ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకుని మొదటి రోజు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత విమానాశ్రయ స్థలాలను పరిశీలిస్తూ భూమి లభ్యత స్థల విస్తీర్ణం భౌగోళిక పరిస్థితులు రన్‌వే ఏర్పాటుకు అనుకూలత విమానాల రాకపోకలకు అవసరమైన అప్రోచ్ ఫన్నెల్ నైట్ ల్యాండింగ్ భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను అధ్యయనం చేసింది.

జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాలుగా సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో స్థల పరిశీలన సర్వే సాంకేతిక అంశాల పరిశీలన కొనసాగుతోంది. ఈ సందర్భంగా సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఏఏఐ సాంకేతిక బృందం సమావేశమై ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడం, ఏటిఆర్72 తరహా విమానాలతో పాటు పెద్ద ఎయిర్‌బస్ ఏ320/ఏ321 విమానాల రాకపోకలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చ జరిగింది. పెద్ద విమానాల రాకపోకలకు అనుగుణంగా సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్‌వే అవసరమయ్యే అవకాశాలను సాంకేతిక బృందం పరిశీలించింది. రన్‌వే ఏర్పాటుకు అవసరమైన భూమి భవిష్యత్ విస్తరణకు అవకాశాలు నైట్ ల్యాండింగ్‌కు అవసరమైన సదుపాయాలు భద్రతా పరికరాలు తదితర అంశాలపై కూడా అధ్యయనం చేస్తున్నారు. ప్రతిపాదిత ప్రాంతానికి సమీపంలో ఉన్న విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే లైన్ కూడా సాంకేతిక బృందం పరిశీలనలో ప్రధాన అంశంగా నిలిచింది. రైల్వే మార్గం విమానాల అప్రోచ్ ఫన్నెల్ పరిధిలోకి వచ్చే అవకాశాల నేపథ్యంలో దాని వల్ల ఏర్పడే సాంకేతిక ప్రభావాలను పరిశీలిస్తున్నారు. అవసరమైతే 'షీల్డింగ్' ప్రక్రియ ద్వారా సాంకేతిక అవరోధాన్ని అధిగమించే అవకాశాలను కూడా పరిశీలించడంతో పాటు రైల్వే శాఖ నుంచి అవసరమైన ఎన్‌ఓసీ పొందే అంశంపై చర్యలు చేపట్టనున్నారు.పరిశీలనలో భాగంగా సంబంధిత అధికారులు సర్వే నంబర్లు భూమి విస్తీర్ణం రెవెన్యూ మ్యాపులు భౌగోళిక కోఆర్డినేట్లు స్థల హద్దులు అప్రోచ్ రోడ్లు రెవెన్యూ సాంకేతిక రికార్డులను సిద్ధంగా ఉంచి ఏఏఐ బృందానికి అందుబాటులో ఉంచారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలిస్తూ రికార్డులతో సరిపోల్చి బృందం సాంకేతిక అధ్యయనం నిర్వహిస్తోంది.

**విమానాశ్రయంతో జిల్లా అభివృద్ధి..**

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పారిశ్రామిక వాణిజ్య పర్యాటక రంగాల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఏఏఐ సాంకేతిక బృందం నిర్వహిస్తున్న పరిశీలనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. అవసరమైన రెవెన్యూ సర్వే సాంకేతిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచి బృందం క్షేత్రస్థాయి పరిశీలన సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు మొదటి రోజు ప్రతిపాదిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించగా రెండో రోజు కూడా షెడ్యూల్ ప్రకారం మిగిలిన ప్రాంతాలు సాంకేతిక అంశాలను బృందం పరిశీలించనుంది. మొత్తం పరిశీలన అనంతరం టెక్నికల్ ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించి విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

ఈ పర్యటనలో సంబంధిత రెవెన్యూ సర్వే ఇంజినీరింగ్ ఇతర శాఖల అధికారులు ఏఏఐ సాంకేతిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**బెల్లంపల్లి,మహ :** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమిని లో ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిని మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులలో ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఐ.విజయ (భీమిని )ఎం. లావణ్య (వెంకటాపూర్) డి. సుదర్శన్( మల్లిడి ఎస్సీ కాలనీ), స్ మల్లేష్(భీమిని) శైలజ (భీమిని) ఏ.మౌనిక (వీగాం ) లను సత్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకటస్వామి మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ కలిసి మండల విద్యాధికారిని శాలువాతో సన్మానించారు.





# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ప్రజల నుంచి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాలు ఉపాధి పింఛన్లు గృహాలు మౌలిక వసతులు సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదిక అని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు.తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి, స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య

**సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు సామాజిక కార్యకర్త**

**భువనగిరి సెప్టెంబర్ 7 మహా న్యూస్** :తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామాజిక కార్యకర్త సంగిశెట్టి క్రిస్టఫర్తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని, అది ప్రజాస్వామ్యానికి శాసనసభ గౌరవానికి ప్రతీక అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిని కించపరిచేలా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని క్రిస్టఫర్డిమాండ్ చేశారు క్షమాపణ చెప్పకపోతే ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



# వ్యక్తి గతంగా దూషిస్తే సహించేది లేదు

**ఎం.ఎల్.సి.తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన మండల కాంగ్రెస్ కమిటీ.**

**దమ్మపేట, మహా :** బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సూదన్ అసెంబ్లీ వద్ద సోమవారం చేసిన అనుచిత వ్యాఖ్యలను దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజా పాలకులను ,తమ రాజకీయ స్వలాభం ,స్వార్ధం కోసం వ్యక్తి గతంగా విమర్శలు చేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ,ప్రజలు అంతా గమనిస్తూనే ఉన్నారని మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు కక్కిరాల రమేష్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు స్థానిక వినాయక ఫంక్షన్ హాలులో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, రాజకీయ సంస్కృతికి విరుద్ధంగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలకు పాల్పడటం సరికాదన్నారు. రాజకీయ భేదాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం, హుందాతనం, ప్రజాస్వామ్య సంప్రదాయాలను ప్రతి నాయకుడు పాటించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంపై విమర్శలు చేయాలనుకుంటే విధానాలపై మాట్లాడాలని, వ్యక్తిగతంగా అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నశెట్టి చిట్టిబాబు, పగడాల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, చిన్న శెట్టి గోపి, పానుగంటి లక్ష్మణ్ తదితర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ నేతల అరెస్టుపై సత్తుపల్లిలో గర్జించిన గులాబీ దండు

- **సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ**




**సత్తుపల్లి,మహా :** తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ సత్తుపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి. మాజీ సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో నల్ల కండువాలు, నల్ల జెండాలతో స్థానిక జీవీ మాల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీకి నల్ల టీషర్టులు ధరించి వెళ్లిన కేటీఆర్, హరీష్ రావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడాన్ని సండ్ర వెంకట వీరయ్య తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కు అని, ప్రశ్నించే గొంతును అడ్డుకోవడం సరికాదని అన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు తదితర నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనపై బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. తెలంగాణ అసెంబ్లీలో నిరసన తెలిపే హక్కు బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులకు లేదా..? అని సండ్ర ప్రశ్నించారు. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా లేవనెత్తడం ప్రతిపక్ష బాధ్యత అని, ప్రతిపక్ష నేతలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.

**1000 రోజుల పాలనపై కాంగ్రెస్‌ను నిలదీసిన సండ్ర**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై ప్రజల్లో అనేక ప్రశ్నలు ఉన్నాయని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. మహిళలకు నెలకు రూ.2,500, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్‌లో తులం బంగారం, అర్హులైన పేదలకు ఇళ్లు తదితర హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. అసెంబ్లీ నుంచి గ్రామస్థాయి వరకు ప్రజల గొంతుకగా గులాబీ జెండా నిరంతరం పోరాడుతుందని అన్నారు. అనంతరం ప్రజల నుంచి సేకరించిన పలు సమస్యల వినతిపత్రాలను ప్రజావాణిలో అధికారులకు సండ్ర వెంకట వీరయ్య సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి బిఆర్ఎస్ నాయకులు, అధిక సంఖ్యలో బిఆర్ఎస్ అభిమానులు పాల్గొన్నారు.

# మద్దిశెట్టి పోశయ్య ఆశయాలను కొనసాగిద్దాం

- **ప్రజా సమస్యలపై ఆయన పోరాటం స్ఫూర్తిదాయకం**
- **సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి, జాజిరి**




**సత్తుపల్లి, మహా** : పేదలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడిన సీపీఎం నాయకుడు మద్దిశెట్టి పోశయ్య ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో సోమవారం కావూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మద్దిశెట్టి పోశయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంస్మరణ సభలో మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ..గంగారం గ్రామంలో సీపీఎం పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పోశయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. పేదలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. ప్రజలతో మమేకమై పనిచేసిన పోశయ్య ప్రతి కార్యకర్తకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాల పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి కార్యకర్తలకు మార్గదర్శకమని అన్నారు. పోశయ్య మృతి సీపీఎంకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొంటూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కమిటీ సభ్యులు రావుల రాజబాబు, మండల నాయకులు అయినంపూడి సనందరావు, కువ్వారపు లక్ష్మణరావు, దేవళ్ల రామారావు, జయరాజు, కొలికిపోగు రత్తయ్య, వెంకటరమణ, రఘు, రాఘవతో పాటు పోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

**ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలి: ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్**



**సత్తుపల్లి, సెప్టెంబర్ 7: మహా :** తెలంగాణ శాసన సభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని.. అది శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనన్నారు. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చని, రాజ్యాంగ బద్ధమైన పదవుల గౌరవాన్ని కించపరిచేలా వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. స్పీకర్‌ను అవమానించడం అంటే శాసనసభ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమే అని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. తాతా మధు తన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

# దళిత స్పీకర్‌పై దుర్భాషలు.. ప్రజాస్వామ్యంపై దాడి..

- తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వం వెంటనే రద్దు చేయాలి..
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి..
- చట్టసభల్లో పోటీ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలి..
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు



**కరీంనగర్, మహా** : దళితుడైన తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కించపరిచేలా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దుర్భాషలాడడం అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో రాజేందర్ రావు మాట్లాడుతూ.. స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధిస్తూ, 'ఎవడ్రా వాడు' అంటూ అవమానకరంగా మాట్లాడటం తాతా మధు అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ఒక వ్యక్తిని కించపరచడం మాత్రమే కాదని, దళిత సమాజాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని రాజేందర్‌రావు అన్నారు. శాసనసభ స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.దళిత స్పీకర్‌పై కులపరమైన దూషణలకు పాల్పడిన తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వెంటనే కేసు నమోదు చేయాలని రాజేందర్‌రావు డిమాండ్ చేశారు. దీంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేసే దిశగా శాసనమండలి చైర్మన్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి భాషను మరోసారి ఎవరూ ఉపయోగించకుండా కఠినమైన శిక్షలు విధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజాప్రతినిధులు విధానాలను విమర్శించవచ్చని, ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చని, కానీ రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులను వ్యక్తిగతంగా దూషించడం, అవమానించడం ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఒక దళిత నేతకు జరిగిన అవమానంగా మాత్రమే ఈ ఘటనను చూడకూడదని.. ఇది ప్రజాస్వామ్యానికి జరిగిన అన్యాయంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని రాజేందర్‌రావు అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టసభలు, ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాత మధు జీవితకాలం చట్టసభలకు పోటీ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్ర రావు కోరారు.

# పాత్రికేయుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

**కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా**
**జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం**




**పెద్దపల్లి మహా, సెప్టెంబర్ 07 :** పెద్దపల్లి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పాత్రికేయుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 500 మంది గుర్తింపు పొందిన జర్నలిస్టులు, మరో 100 మంది గుర్తింపు లేని జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.గత విద్యా సంవత్సరాల్లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పాత్రికేయుల పిల్లలకు ఒక విద్యార్థికి ఉచిత విద్య, రెండో విద్యార్థికి 50 శాతం ఫీజు రాయితీ కల్పించే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అదే విధానాన్ని 2026-27 విద్యా సంవత్సరంలోనూ కొనసాగించాలని కోరారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పాత్రికేయుల పిల్లలకు ఫీజు రాయితీ అమలు చేసేలా జిల్లా విద్యాశాఖ ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పాత్రికేయుల పిల్లలకు విద్యా రాయితీలు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నారని, అదే విధంగా పెద్దపల్లి జిల్లాలోనూ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలా చేయకుండా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పత్రికలో పని చేసి పిల్లలకురాయితీ కల్పిస్తుంది. కానీ పెద్దపల్లి జిల్లాలో మాత్రం ఈ విధానాన్ని అమలు చేయకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.ధర్నా అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేసి, పాత్రికేయుల పిల్లల విద్యాభ్యాసానికి ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారుల వెంటనే అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.పాత్రికేయుల న్యాయమైన డిమాండ్‌ను జిల్లా యంత్రాంగం వెంటనే పరిష్కరించి, 2026-27 విద్యా సంవత్సరానికి ఫీజు రాయితీ అమలుకు చర్యలు తీసుకోవాలని దీంతోపాటు ప్రభుత్వం పాత్రికేయులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మరియు పాత్రికేయులకు సంబంధించిన సమస్యలును వెంటనే పరిష్కరించే విధంగా రూపకల్పన చేయాలని ప్రెస్ క్లబ్ పాత్రికేయ ప్రతినిధులు కోరారు.జిల్లా అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్, దొమ్మటి రాజేశం, దుర్గం లక్ష్మణ్, ఆవునూరి సంపత్, రమేష్,తదితర పాత్రికేయ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు..

- తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే పాయం..
- రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాలని హితవు..

**మణుగూరు, మహా :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బాధ్యతాయుతమైన ఎమ్మెల్సీ పదవిలో ఉన్న వ్యక్తి అసెంబ్లీ ప్రాంగణం వద్ద పోలీసులను దూషించడంతో పాటు స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. అధికార, ప్రతిపక్షాలు అనే తేడా లేకుండా ప్రజాప్రతినిధులు రాజ్యాంగ సంస్థలను, పదవులను గౌరవిస్తూ హుందాగా వ్యవహరించాలని సూచించారు. తాతా మధు వ్యాఖ్యలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి ఘటనపై విచారణ జరిపి చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పాయం డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి స్పీకర్‌కు, దళిత సమాజానికి జరిగిన అవమానంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలానికి తావివ్వరాదని, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెరిగేలా రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హితవు పలికారు.



# కనీస వేతనాల సలహా మండలిలో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎస్ఎంఎస్ ప్లాంట్ వద్ద నిరసన

**మణుగూరు, మహా :** కేంద్ర కనీస వేతనాల సలహా మండలిలో సీఐటీయూతో పాటు ప్రధాన జాతీయ కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం మణుగూరులోని ఎస్ఎంఎస్ ప్లాంట్ వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కనీస వేతనాల సలహా మండలిలో కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న సీఐటీయూతో పాటు ఇతర ప్రధాన జాతీయ కార్మిక సంఘాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని విమర్శించారు. ప్రభుత్వం, యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరించే సంఘాలకు మాత్రమే అవకాశం కల్పించడం సరికాదన్నారు. కార్మికుల సమస్యలు, హక్కులపై నిరంతరం పోరాడుతున్న సంఘాలను మండలికి దూరంగా ఉంచడం అన్యాయమన్నారు. సీఐటీయూతో పాటు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ వంటి కేంద్ర కార్మిక సంఘాలకు కనీస వేతనాల సలహా మండలిలో ప్రాతినిధ్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తులసి, కృష్ణయ్య, బాలకృష్ణతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# రూ.200 కోట్లతో ధర్మపురి దివ్య క్షేత్రాభివృద్ధి

- దశాబ్దాల భక్తుల కలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం శ్రీకారం
- రూ.117 కోట్లకు అదనంగా మరో రూ.80 కోట్లు మంజూరు
- వేకువజామున 2.58 గంటలకు ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ
- శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**ధర్మపురి మహా** : దక్షిణ కాశీగా పేరొందిన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి సరికొత్త వైభవం రానుంది. దశాబ్దాలుగా భక్తులు, స్థానికులు ఎదురుచూస్తున్న ఆలయ సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భారీ నిధులు కేటాయించింది. మొత్తం రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ధర్మపురి క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులకు సోమవారం వేకువజామున 2.58 గంటలకు శ్రీకారం చుట్టారు.వేద పండితులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో రూ.10 కోట్లతో చేపట్టనున్న శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.అంతకుముందు డిప్యూటీ సీఎం, మంత్రి ఆలయంలోని శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి, శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య వారికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

**మాటలు కాదు.. చేతల్లో చూపిస్తున్నాం**

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధిపై గతంలో పలువురు హామీలు ఇచ్చినా నిధులు కేటాయించలేదని అన్నారు. తమ ప్రజా ప్రభుత్వం మాత్రం ఇప్పటికే రూ.117 కోట్లు మంజూరు చేసిందని, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ భక్తుల సౌకర్యాలు, ఆలయాభివృద్ధికి మరిన్ని నిధులు కోరడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు అదనంగా మరో రూ.80 కోట్లు మంజూరు చేశామని తెలిపారు.మొత్తంగా సుమారు రూ.200 కోట్లతో ధర్మపురి క్షేత్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయనున్నామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు క్షేత్రానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని బాసర నుంచి భద్రాచలం వరకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. గోదావరి ప్రవాహం వెంట ఉన్న ప్రముఖ ఆలయాలు, పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.

**వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

రూ.10 కోట్లతో శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం.

రూ.58.55 కోట్లతో 9 రకాల మౌలిక వసతులు, ఆలయ అభివృద్ధి పనులు.

రూ.22.16 కోట్లతో గోదావరి పుష్కరాల కోసం నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం.

రూ.2.48 కోట్లతో ధర్మపురి మండలం తిమ్మాపూర్‌లో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం.

రూ.200 కోట్లతో ధర్మపురి క్షేత్రం రూపురేఖలు మారనున్న నేపథ్యంలో భక్తులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## బీఆర్ఎస్ నాయకులపై దాడులను ఖండించిన షేక్ గౌసుద్దీన్

**కారేపల్లి, మహా:** తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ గౌసుద్దీన్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై పోలీసుల ద్వారా దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు నాయకత్వంలో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, శాసన మండలి సభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా కేటీఆర్, హరీష్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, శాసనమండలి సభ్యుడు తాతా మధుసూదన్ తదితర నాయకుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉందని గౌసుద్దీన్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు డిక్లరేషన్ల పేరుతో ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకుండా ఆయా వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజల తరఫున గొంతెత్తుతున్న బీఆర్ఎస్ నాయకులను అడ్డుకోవడం, వారిపై పోలీసులతో దాడులు చేయించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా ప్రజల్లో పెరుగుతున్న ప్రభుత్వ వ్యతిరేకతను ఆపలేరని స్పష్టం చేశారు.అలాగే బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, తన్నీరు హరీష్‌రావుతో పాటు మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి తదితరుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరును కూడా షేక్ గౌసుద్దీన్ తీవ్రంగా ఖండించారు.రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ నాయకులపై ఇలాంటి చర్యలకు పాల్పడితే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులపై జరిగిన ఘటనలకు బాధ్యులైన వారు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ గౌసుద్దీన్ డిమాండ్ చేశారు.

## విమర్శించే ముందు పదేళ్ల పాలనపై సమాధానం చెప్పాలి

**బీఆర్ఎస్ నేతకు కాంగ్రెస్ నేతల హితవు**

**మణుగూరు, మహా :** పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై విమర్శలు చేసే ముందు బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మణుగూరు ప్రాంతానికి, పినపాక నియోజకవర్గానికి ఏం చేసిందో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు ప్రజలకు సమాధానం చెప్పాలని మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, కురం రవి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేపై కుర్రి నాగేశ్వరరావు చేసిన విమర్శలను సోమవారం వారు తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ప్రజాప్రతినిధిపై కమిషన్ల ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆరోపణలు చేసే ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమిటో వివరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, ఎమ్మెల్యే పాయం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని నవీన్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, చేపట్టిన అభివృద్ధిపై ముందుగా బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. వ్యక్తిగత ఆరోపణలు మానుకుని ప్రజా సమస్యలు, అభివృద్ధిపై నిర్మాణాత్మకంగా మాట్లాడాలని కుర్రి నాగేశ్వరరావుకు సూచించారు. ఎమ్మెల్యే పాయంపై నిరాధార ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ పార్టీ తరఫున తగిన రీతిలో స్పందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు పొడుతూరి రవి, దుగ్గంపూడి ఈశ్వర్‌రెడ్డి, కోర్లకుంట అప్పారావు, వాసంశెట్టి వెంకట్రావు, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఈశ్వర్, నందు, తమ్మిశెట్టి శ్రీను, నానాజీ తదితరులు పాల్గొన్నారు.




# రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ చికిత్సల్లోవిప్లవాత్మక మార్పులు..

**యశోద ఆసుపత్రి వైద్యులు, రాజేష్.**

**రాజేంద్రనగర్ మహా :** క్యాన్సర్ చికిత్స రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని డాక్టర్ రాజేష్ తెలిపారు. శంషాబాద్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు ట్యూమర్ బయాలజీపై మెరుగైన అవగాహన పెరగడంతో క్యాన్సర్ శస్త్రచికిత్సల లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాకుండా రోగికి మెరుగైన జీవన నాణ్యతను అందిస్తూ పూర్తి చికిత్స ఫలితాలను సాధించినట్లు తెలిపారు.ఈ మార్పులో అత్యంత ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలలో రోబోటిక్ సర్జరీ ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ ప్రధానమైనవి. హైడెఫినిషన్ 3 విజన్, ట్రెమర్‌ఫ్రీ ఇన్‌స్ట్రుమెంట్స్, మనిషి చేతి కదలికలను అనుకరించే అధునాతన క్లిష్టమైన శస్త్రచికిత్సలను అత్యంత నైపుణ్యంతో నిర్వహించడం సాధ్యమవుతోంది. కోతలు అవసరం లేకుండా కేవలం చిన్న పోర్ట్స్ ద్వారా శస్త్రచికిత్స నిర్వహించవచ్చు. దీని వలన రోగులకు తక్కువ నొప్పి, చిన్న మచ్చలు మరియు తక్కువ రక్తనష్టం వంటి ప్రయోజనాలు లభిస్తాయి.అదనంగా స్మార్ట్ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలయికతో శస్త్రచికిత్సలు మరింత ఖచ్చితమైనవి, సమర్థవంతమైనవి సురక్షితమైన వని తెలిపారు.



# రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

**కారేపల్లి, మహా** : కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకుడు తమ్మిశెట్టి శ్రీనివాసరావు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్నారు. ఆయనను సోమవారం కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఇంటర్మీడియట్ చరిత్ర పుస్తకం అభివృద్ధి కమిటీ సభ్యులుగా రాష్ట్రస్థాయిలో చరిత్ర పుస్తకం బోధన లో మెలకువల పై అధ్యాపకులకు పై శిక్షణ ఇచ్చే శిక్షకుడిగా పనిచేస్తూ అధికారులు విద్యార్థులు తోటి అధ్యాపకుల మన్నలను అందుకుంటున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ అవార్డు తనకు ఆనందాన్నిచ్చిందని, ఇకపై మరింత బాధ్యతగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గాప్రసాద్, రాజ్యలక్ష్మి, సాజిదా, లక్ష్మీనారాయణ, రాంబాబు,ఖాసీం,వనిత, యాకుబ్ పాషా, యాకయ్య, విద్యార్థులు పాల్గొన్నారు

# దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ అహంకారం తగదు

**కాంగ్రెస్ పార్టీ మొయినాబాద్ మండలం అధ్యక్షులు బొల్లిగిద్ద సత్యనారాయణ**

**మొయినాబాద్ మహా:** గౌరవప్రదమైన రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు మరియు అసభ్య పదజాలం ఉపయోగించడాన్ని మొయినాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లిగిద్ద సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బొల్లిగిద్ద సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ స్థానానికి ఒక ప్రత్యేకమైన గౌరవం ఉంటుందని, అలాంటిది ఒక దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను పట్టుకొని అంతటి అసభ్య పదజాలంతో దూషించడం బీఆర్ఎస్ పార్టీ యొక్క అహంకారానికి, దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. పదవుల అహంకారంతో ప్రతిపక్ష నాయకులు విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిని గౌరవించడం కనీస బాధ్యత అని, దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే మొత్తం దళిత సమాజాన్ని అవమానించడమేనని బొల్లిగిద్ద సత్యనారాయణ స్పష్టం చేశారు. తక్షణమే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు మరియు దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే బీఆర్ఎస్ నాయకులకు తగిన బుద్ధి చెబుతారని బొల్లిగిద్ద సత్యనారాయణ హెచ్చరించారు..



# గోశాల,వేద పాఠశాలల కొరకు స్థలం కేటాయించాలి

**బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతిపత్రం అందజేత**

**బెల్లంపల్లి, మహ :** బెల్లంపల్లి బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు ప్రజావాణిలో గోశాల, వేదశాల తోపాటు బ్రాహ్మణులకు స్థలం కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు వి.ఎల్.ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ బెల్లంపల్లి మండలంలో దాదాపు 300 కుటుంబాలకు పైగా బ్రాహ్మణులు నివసిస్తున్నారని ఏదైనా కార్యక్రమాలు నిర్వహించాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం తమ విజ్ఞప్తిని పరిశీలించి స్థలాన్ని కేటాయించాలని కోరారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గౌషాల,వేద పాఠశాల,యజ్ఞశాల నిర్మాణంతోపాటు వేద గాయత్రీ మాత ఆలయం నిర్మాణం చేపట్టాలని సంకల్పించారని తెలిపారు. గతం లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు వినతి పత్రం సమర్పించినట్టు వెల్లడించారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తమ విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎస్ ప్రత్యేక సలహాదారు కొమ్మెర లక్ష్మణ్ సభ్యులు జగన్మోహన్,మనోజ్ పాండే, చిమిరాల శ్రీనివాస్,దత్తాత్రేయ రావు,సత్యనారాయణ, మహేష్ శర్మ, భజరంగ్ కొలారియా తదితర పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌కు 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'

- **చిగురుమామిడి పాఠశాల ఎంపిక.. రూ.9.62 కోట్లతో ఆధునీకీకరణ.**
- **మంత్రి పొన్నం ప్రభాకర్ కృషికి నియోజకవర్గ ప్రజల అభినందనలు**

**చిగురుమామిడి మహా** : హుస్నాబాద్ నియోజకవర్గ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ (TGPS)గా ఎంపిక చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాఠశాల అభివృద్ధికి రూ.9.62 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక మౌలిక వసతులు కల్పించనున్నారు. దీంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్యారంగానికి మరింత ఊతం లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో 73 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.699.895 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు 2026 సెప్టెంబర్ 5న G.O.Rt.No.164 జారీ చేసింది. ఇందులో కరీంనగర్ జిల్లా, హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం, చిగురుమామిడి మండలంలోని పాఠశాలకు చోటు దక్కింది. నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ పాఠశాలను మంజూరు చేయించేందుకు కృషి చేసిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హుస్నాబాద్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందించడంతో పాటు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. చిగురుమామిడిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో మండలంతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని, భవిష్యత్తులో ఉన్నత విద్యకు ఇది బలమైన పునాదిగా నిలుస్తుందని స్థానికులు పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, ఇందుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల అరెస్టు అమానుషం

- కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి...
- బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు.

**రాజేంద్రనగర్ మహా** : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నల్ల టిషర్టులతో నిరసనకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని అత్తాపూర్, శంషాబాద్ లో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొన్నెమొల్ల శ్రీనివాస్, ఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మని దగ్ధం చేశారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీ గేటు వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, జగదీష్ రెడ్డిలతో పాటు నిరసన తెలుపుతున్న మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తోపులాటలో పలువురు నేతలకు గాయాలయ్యాయి కాంగ్రెస్ ప్రజా పాలనలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు నిరసన తెలిపే హక్కు కూడా లేదా అంటూ వాపోయారు. పోలీసులు బిఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు.



# ఎస్సీ వర్గీకరణలో శాస్త్రీయత హేతుబద్ధత లేదు

- మాలలకు అన్యాయం చేయకండి
- న్యాయం చేసి సంక్షేమానికి నిధులు ఇవ్వండి
- త్వరలో పల్లె పల్లెకు మాలల చైతన్య యాత్ర
- మాలలంతా ఏకమై పోరాటాన్ని ఉధృతం చేయాలి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఎస్సీల శాస్త్రీయబద్ధ పునర్ వర్గీకరణ రోస్టర్ పాయింట్ల పెంపుకై పల్లె పల్లెకు మాలల చైతన్య యాత్రను నిర్వహించనున్నామని టిఈఏఎం రాష్ట్ర గౌరవ సలహాదారులు సలాకుల శంకర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, శనగ వెంకటేశ్వర్లు, కన్వీనర్ దాసరి రమేష్ లు తెలిపారు. సోమవారం చుంచుపల్లిలో గల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా జరిపిన ఎస్సీ వర్గీకరణలో శాస్త్రీయత హేతుబద్ధత లేదని రోస్టర్ పాయింట్లలో కూడా మాలలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు జరిగిన ఈ అన్యాయాన్ని మాలల చైతన్య యాత్ర ద్వారా పల్లె పల్లెకు వాడవాడకు వెళ్లి రాష్ట్రవ్యాప్తంగా మాలలను జాగృతం చేసి మన వాణిని అసెంబ్లీ సెక్రటరీ ఏట్ సాక్షిగా దిక్కులు పిక్కటిల్లేటట్లుగా వినిపించి వర్గీకరణలో మాల జాతికి న్యాయం జరిగేంత వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఏకపక్షంగా ఒక వర్గానికి మేలు కలగడానికి అత్యుత్సాహంతో మన రాష్ట్ర ప్రభుత్వం మాల జాతికి చేసిన అన్యాయాన్నిఒక కార్యాచరణ ప్రణాళిక బద్ధమైన ప్రజాస్వామిక బద్ధమైన చైతన్య యాత్రల ద్వారా పరిపాలకుల కళ్ళు తెరిపించి మాల జాతి భవిష్యత్ తరాలకు విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాలల్లో మాల జాతికి న్యాయం జరిగేంత వరకు, మాలల సంక్షేమం అభివృద్ధి ఐక్యతలే ఎజెండాగా ఈ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. తొలుత రెండు ఉమ్మడి జిల్లాలలో గల 43 మండలాలను పూర్తి చేసినాక రాష్ట్రవ్యాప్తంగా జరుపుతామని భావ సారుప్యత గల అందరు మంత్రులను ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తామని ఈ మాల చైతన్య యాత్ర యొక్క కార్యాచరణ ప్రణాళికను షెడ్యూల్ ను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. ఈ మా న్యాయపరమైన పోరాటానికి అభ్యుదయవాదులు ప్రజాస్వామికవాదులు సామాజిక చైతన్యవాదులు మంత్రులు ఎమ్మెల్యేలు మిగతా ప్రజా ప్రతినిధులు మహిళా విద్యార్థి యువజన సంఘాలు రాజకీయాలకతీతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంఘీభావాన్ని తెలిపి ఈ మహా యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ అత్యవసర సమావేశానికిరాష్ట్ర కన్వీనర్ దాసరి రమేష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారులు సలాకుల శంకర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్,శనగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కన్వీనర్ దాసరి రమేష్‌లతోపాటు కోకన్వీనర్లు బూర్గుల కరుణాకర్, శెట్టి కమలాకర్, సంఘ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు తలారి కిషోర్ బాబు, డి.సుధాకర్, తమ్మల్ల జోష్, మద్దాల మహేష్, ఉల్లోజు వెంకటరమణ, ఉల్లోజు ప్రియదర్శిని, సూరం వరప్రసాద్, రవి, మద్దెల ఆదర్శ్, రాజేశ్వరరావులతోపాటు ప్రచార కార్యదర్శులు శనగల లక్ష్మణ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ పట్ల బీఆర్ఎస్ సభ్యుడి తీరును ఖండించిన మల్‌రెడ్డి రంగారెడ్డి ...

**అసెంబ్లీ చరిత్రలో చీకటి అధ్యాయంగా పేర్కొన్న ఎమ్మెల్యే...**

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 7 మహా:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్‌కు చెందిన శాసనమండలి సభ్యుడు తాతా మధు మాట్లాడిన తీరును, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ చరిత్రలో ఈ ఘటనను చీకటి అధ్యాయంగా ఆయన అభివర్ణించారు. స్పీకర్ కుటుంబం పట్ల హేయమైన రీతిలో మాట్లాడిన తీరు కేవలం దళితులకు మాత్రమే కాకుండా, తెలంగాణ సమాజానికి జరిగిన అవమానంగా పేర్కొన్నారు. శాసన మండలి సభ్యుడిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న మల్‌రెడ్డి రంగారెడ్డి... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.





# రాస్తారోకో చేస్తున్న బిఆర్ఎస్ నాయకుల అరెస్టు

- ..బిఆర్ఎస్ ఎమ్మెల్యేల దాడికి నిరసనగా

**బెల్లంపల్లి, మహా**: అసెంబ్లీ ముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన దాడికి నిరసనగా బెల్లంపల్లి పట్టణంలో రాస్తారోకో చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి బెల్లంపల్లి నుండి మాదారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని తీవ్రంగా నిరసిస్తూ బెల్లంపల్లి పట్టణంలో బిఆర్ఎస్ బిఆర్ఎస్వి నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులను పోలీసులు అడ్డుకుని అక్రమంగా అరెస్ట్ చేసి బెల్లంపల్లి పట్టణం నుంచి మాదారం పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తూ, ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడి చేయడం ఒకవైపు, ఆ దాడిని ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన నాయకులను అరెస్ట్ చేయడం ఎంతవరకు సబబు అన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలపై దాడి చేస్తే తప్పు కాదు..దాన్ని ప్రశ్నిస్తే మాత్రం అరెస్టా?" అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం పోలీసు బలంతో అణచివేయాలని చూస్తోందని, అరెస్టులు, కేసులు, బెదిరింపులతో బిఆర్ఎస్ నాయకులను భయపెట్టలేరని స్పష్టం చేశారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపుతామని కాంగ్రెస్ ప్రభుత్వం అనుకుంటే అది వారి భ్రమ మాత్రమే నని వెల్లడించారు. అరెస్టయిన వారిలో బిఆర్ ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ అధ్యక్షులు నూనెటి సత్యనారాయణ, నాయకులు మద్దెల గోపి కృష్ణ,రెవెల్లి విజయ్,సబ్బని అరుణ్,ఎరుకల సుందర్ రావు,ధర్మేందర్ ఉన్నారు.



# కన్నెపల్లి మండల పిఆర్టియు టిఎస్ కార్యవర్గం ఎన్నిక

**బెల్లంపల్లి, మహా**: కన్నెపల్లి మండలం పి ఆర్ టి యు టి ఎస్ సర్వసభ్యసమావేశం స్థానిక జెడ్పిహెచ్ఎస్ బజార్ ఏరియా పాఠశాలలో సోమవారం నాడు నిర్వహించి మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా గునిగంటి మోహన్,ప్రధాన కార్యదర్శిగా అంకతి తిరుపతి,అసోసియేట్ అధ్యక్షులుగా బత్తుల రవీందర్,మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా మూడేడ్ల రాజేశ్వరి ,ఉపాధ్యక్షులుగా జాడి రమేష్, మహిళా ఉపాధ్యక్షులుగా బొడ్డేల స్వర్ణలత,కార్యదర్శిగా దడిగెల నరేష్, మహిళా కార్యదర్శిగా గుడిపాటి రచన లను ఎన్నుకున్నారు.

# వెండి కొండ సిద్ధేశ్వర స్వామికి అభిషేకం

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్‌లోని ప్రసిద్ధ సిద్దులగుట్ట శ్రీ వెండికొండ సిద్ధేశ్వర స్వామివారి 71వ బ్రహ్మోత్సవాలు (సిద్దులగుట్ట జాతర) అత్యంత వైభవంగా జరిగాయి. శ్రావణ మాస చివరి సోమవారం సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వెండికొండ సిద్దేశ్వరునికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన శ్రావణ మాస చివరి సోమవారం వెండికొండ సిద్ధేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. ఈ జాతరలో నిర్వహించిన మహామంగళహారతి, మహా రుద్రాభిషేకం, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు శివభక్తులు తదితరులు పాల్గొన్నారు.



## పండగలు జాతరల ఊరేగింపుల పై

# పోలీస్ శిక్షకులకు ప్రత్యేక శిక్షణ

- ప్రజల పట్ల పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత, ఐపిఎస్




**హనుమకొండ, మహా :** పండగలు జాతరలు ఊరేగింపులు జరిగే సందర్భాల్లో ఎక్కువ జన సమూహం ఉన్నప్పుడు శాంతి భద్రతలకు సంబంధించిన అంశంలో అక్కడ విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజల పట్ల వ్యహరించాల్సిన తీరుపై భద్రాద్రి జోనల్ పరిధిలోని పోలీస్ శిక్షకులకు మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో నాలుగు రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించ బడ్డాయని వరంగల్ సీపి ఎన్ శ్వేత తెలిపారు. వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళతో సహ మొత్తం 43మంది పోలీస్ శిక్షకులకు ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతుల్లో ప్రధానంగా పండగలు, జాతరలు, ఊరేగింపులు జరిగే సమయాల్లో అక్కడికి వచ్చే ప్రజలతో పోలీస్ అధికారులు, సిబ్బంది వ్యహరించాల్సిన తీరు పై శిక్షణకు వచ్చిన పోలీస్ అధికారులకు తరగతి గదుల్లో భోధించడంతో పాటు ప్రాక్టీకల్‌గా అధికారులు వివరించారు. వివిధ జిల్లాల నుండి శిక్షణకై తరలివచ్చిన పోలీస్ శిక్షకులు శిక్షణ అనంతరం వారి వారి జిల్లా పోలీస్ యూనిట్లలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఇదే తరహాలో శిక్షణ అందించడం జరుగుతుందని సీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపిలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్, సిటిసి ఏసిపి రమణబాబు, ఆర్.ఐ సింహచలం శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ సూర్యప్రసాద్‌తో ఇతర శిక్షణ కేంద్రం పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# స్పీకర్ పై ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు సిగ్గుచేటు

**మధు సభ్యత్వం వెంటనే రద్దు చేయాలి**
**వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్**

**వరంగల్,పోచమ్మ మైదాన్ మహా :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గా ఉన్నత పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు అని ఆ వ్యాఖ్యలను నిరసిస్తూ టీపీసీసీ ఆదేశాల మేరకు సోమవారం వరంగల్ నగరం లోని పోచమ్మ మైదాన్ జంక్షన్ వద్ద వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి, ఆయన పై బీఆర్ఎస్ పార్టీ తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూఒక దళిత బిడ్డ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఉన్నత స్థానంలో కొనసాగుతుండగా, ఆయన పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి పదేళ్లు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు అదే దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్‌గా ఉన్నత పదవిలో కొనసాగడాన్ని జీర్ణించుకోలేక ఇలాంటి వ్యాఖ్యలకు దిగడం వారి అహంకారానికి నిదర్శనమని అయూబ్ మండిపడ్డారు. ప్రజల సమస్యల పై చర్చించాల్సిన శాసనసభ్యులు వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ప్రజా సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు, ప్రతిపక్షంలో ఉన్నా తమ వైఖరిని మార్చుకోలేదని విమర్శించారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై బీఆర్ఎస్ పార్టీ తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, మాజీ కార్పొరేటర్ గుండెటి నరేందr, జన్ను శీభా రాణి అనిల్ కుమార్, తత్తరి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యకుడు కొమురరెడ్డి మండల అధ్యక్షుడు దాడి శివ, డివిజన్ అధ్యక్షులు బాసని కరుణాకర్, కుసుమ సతీష్, సన్నీ, సయ్యద్ ఇంతియాజ్, జన్ను అరుణాకర్, రాజ్ కుమార్, కందుల అశోక్, కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి శ్రీను, బాషాపక సదానందం, కోదాటి అనిల్, కమ్మలుదిన్, తాయిర్ భాయ్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల, టౌన్, డివిజన్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కారించాలి

- బల్దియా కమిషనర్ టి వెంకన్న
- గత వారం దరఖాస్తుల పురోగతి పై సమీక్షించిన కమిషనర్

**వరంగల్, కార్పొరేషన్ :** ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి మెరుగైన పౌర సేవలు అందించడమే బల్దియా ప్రధాన లక్ష్యమని కమిషనర్ టి.వెంకన్న అన్నారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం, జాప్యాన్ని సహించేది లేదని అధికారులను స్పష్టం చేశారు.సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత విభాగాలకు పంపించి, అధికారులు పరస్పర సమన్వయంతో, మానవతా దృక్పథంతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. గత వారం ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార పురోగతిని విభాగాల వారీగా కమిషనర్ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, సంబంధిత ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రతి సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కేవలం దరఖాస్తులు స్వీకరించే వేదికగా కాకుండా, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే సమర్థవంతమైన వేదికగా ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు.ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్..37, ఇంజినీరింగ్..30, ఆరోగ్యం, పారిశుద్ధ్యం.. 07, రెవెన్యూ.. 09, నీటి సరఫరా.. 04 ఎలక్ట్రికల్... 01, మొత్తం 88 గా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, పన్నుల అధికారి రామకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి.. పర్యావరణాన్ని కాపాడాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**హనుమకొండ, మహా;** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి, సహజ రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ), హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరుతూ గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువులు,కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి కాలుష్యం ద్వారా పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. ప్రజలు పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా నీటి వనరులను, ప్రకృతిని కాపాడేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.వినాయక చవితి సందర్భంగా భక్తి భావంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సహజంగా కలిసిపోయే మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పండుగను పర్యావరణ హితంగా నిర్వహించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ టీజీపీసీబీ నోడల్ అధికారి బి. జీమూత వాహన, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**పెద్దపల్లి,మహా, సెప్టెంబర్ 7:** ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.మ్యాపింగ్ లేని, అనామలీస్ ఉన్న ఓటర్లకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని, నోటీసు ఇచ్చిన ఏడు రోజుల అనంతరం నిబంధనల ప్రకారం విచారణ నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. హియరింగ్ అనంతరం డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.పెద్దపల్లి ఐడీఓసీ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు శ్రీరాములు, అరుణశ్రీ, ఆర్డీవో గంగయ్య, ఈసెక్షన్ సూపరింటెండెంట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.




# రైతులు తప్పనిసరి పంట నమోదు చేయాలి

**మండల వ్యవసాయ అధికారి శ్వేత....**

**రాజేంద్రనగర్ మహా ;** డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా రైతులు తాము సాగు చేస్తున్న పంట వివరాలను వ్యవసాయ అధికారులకు తప్పనిసరిగా తెలియజేయాలి, ఆన్ లైన్లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్వేత ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ మండలంలోని 29 రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం నియమించిన వాలంటీర్లు , వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లి పంటల వివరాలను సేకరించి ఆన్ లైన్లో నమోదు చేయాలన్నారు. పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం వరి, పత్తి, మొక్కజొన్న, కంది ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. రైతులు పంట నమోదుకు గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు తమతమ పొలాల్లో పంట వివరాలను తెలియజేయాలని పేర్కొన్నారు. పంట నమోదు విషయంలో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత వ్యవసాయ క్లస్టర్లు విస్తరణ అధికారులు హమీదుల్లానగర్, మల్కారం రైతు వేదికల్లో సంప్రదించాలన్నారు. మండలంలో కొంతమేర వాలంటీర్ల కొరత కారణంగా 11 గ్రామాల్లో వాలంటీర్లు నియామకం జరగలేదు, రైతులు సహకారం అందక డిజిటల్ క్రాప్ సర్వే మందకొడిగా సాగుతోంది. చదువుకున్న యువత, వ్యవసాయం, గ్రామంపై అవగాహన ఉన్నవారు వాలంటీర్లుగా ముందుకు రావాలన్నారు, వారికి ఆర్థిక ప్రోత్సాహం సైతం ఉంటుందని, పంటల నమోదుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డిజిటల్ క్రాప్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.



# సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలి
- హసన్‌పర్తి సీఐ ఏ. మహేందర్
- పోలీస్ జాగృతి కళా బృందంచే అవగాహన కార్యక్రమం

హసన్‌పర్తి, మహా : వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ ఆదేశాల మేరకు ప్రజల్లో సామాజిక చైతన్యం నేరాలపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా నాగరం గ్రామంలో 'పోలీస్ జాగృతి కళా బృందంచే ప్రజలను చైతన్యపరిచే విధంగా ఓ చక్కటి అవగాహన కార్యక్రమాన్ని హసన్‌పర్తి పోలీస్ ఇన్స్పెక్టర్ ఏ మహేందర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్, సబ్ ఇన్స్పెక్టర్ రవి తో పాటు గ్రామ పోలీసు అధికారి వై. ప్రకాష్ , పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.ఈ సందర్భంగా పోలీస్ జాగృతి కళా బృందం సభ్యులు తమ సాంస్కృతిక ప్రదర్శనలు, ఆట, పాటల ద్వారా సమాజంలో జరుగుతున్న పలు అసాంఘిక కార్యకలాపాలపై గ్రామ ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మహేందర్ మాట్లాడుతూ సైబర్ నేరాలు ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మహిళల భద్రత 'షీ టీమ్స్' సేవలు, అత్యవసర సమయాల్లో డయల్ 100..112 ప్రాధాన్యత మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వేధింపులు, రోడ్డు భద్రతా నియమాలు సామాజిక రుగ్మతలు మూఢనమ్మకాల నిర్మూలన పై ప్రజలకు అవగాహన తప్పనిసరి అని అన్నారు. సాంకేతికత పెరుగుతున్న నేటి కాలంలో ప్రజలు, ముఖ్యంగా యువత మహిళలు వివిధ రకాల సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.ఈ అవగాహన సదస్సుకు నాగరం గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు స్థానిక పెద్దలు, యువకుల తో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# గణపతుల నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

**బల్దియా కమిషనర్ టి వెంకన్న**
**వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం**

**వరంగల్, కార్పొరేషన్ మహా;** వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ప్రజలు నిర్వహించుకునేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అలాగే గణేష్ నిమజ్జనానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో వినాయక చవితి, నిమజ్జన ఏర్పాట్లపై కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండగ నిర్వహణ, నిమజ్జన కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టేందుకు పలు కీలక సూచనలు చేశారు. వినాయక చవితితో పాటు నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, తాగునీటి వసతి, చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, క్రేన్లకు ఇంధన సరఫరా తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 13వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి సంసిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గణేష్ విగ్రహాలు తరలించే ప్రధాన మార్గాల్లో రహదారులపై ఉన్న గుంతలు, ప్యాచ్‌వర్క్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, గత సంవత్సరం చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి అవసరమైన చోట మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.వినాయక మండపాల వద్ద ప్రత్యేక చెత్త బిన్లు ఏర్పాటు చేసి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి నిర్వాహకులకు ముందస్తుగా నోటీసులు జారీ చేయాలని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో మండపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.నిమజ్జన ప్రదేశాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఆర్ఎఫ్, రెస్క్యూ, మత్స్య శాఖ సిబ్బంది బోట్లతో సిద్ధంగా ఉండాలని కమిషనర్ సూచించారు. అలాగే హార్టికల్చర్ విభాగం సమన్వయంతో విగ్రహాలు తరలించే మార్గాల్లో వాహనాలకు, భక్తులకు ఇబ్బంది కలిగించే పెద్ద చెట్ల కొమ్మలను ముందుగానే తొలగించాలని అన్నారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను నిర్లక్ష్యం లేకుండా అంకితభావంతో పూర్తి చేయాలని కమిషనర్ టి. వెంకన్న స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి శంకర్‌లింగం, ముఖ్య హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, కార్యదర్శి అనిల్ కుమార్, ఆరోగ్య అధికారి డా. రాజేష్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలి

**పెద్దపల్లి మహా,సెప్టెంబర్ 07 :** గోదావరి పుష్కరాల సందర్భంగా టైర్-1లో ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు పాల్గొన్నారు. భూసేకరణ ప్రతిపాదనలను వెంటనే ప్రభుత్వానికి పంపి ఆమోదాలు పొందాలని, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. టెండర్ల పేరుతో పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. పనులు ప్రారంభమైన వెంటనే అవసరమైన కార్మికులు, నిర్మాణ సామగ్రి, యంత్రాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి జిల్లాకు నోడల్ అధికారిని నియమించినట్లు కమిషనర్ హనుమంతరావు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కరాల ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# తాతా మధు వ్యాఖ్యల పై భగ్గుమన్న డిసిసి అధ్యక్షుడు ఇనగాల

**భారీ ధర్నా, దిష్టి బొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ శ్రేణులు**

**హనుమకొండ, మహా ;** వరంగల్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి.
ఈ వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం హాసన్పర్తి మండల కేంద్రంలో మండల అధ్యక్షులు రేణిగుంట్ల అశోక్, డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్, పుట్ట తిరుపతి ఆధ్వర్యంలో భారీ ధర్నా, దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. అత్యున్నతమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తి పై బాధ్యతారహితంగా, అవమానకరంగా మాట్లాడటం బీఆర్ఎస్ పార్టీ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. తాతా మధు తక్షణమే స్పీకర్ కు, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
తెలంగాణ శాసనసభ స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదు. తాతా మధు వ్యాఖ్యల పట్ల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు సంఘీభావం ప్రకటించారు. స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక



వ్యక్తిని అవమానించడం కాదు.. రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉంది.ఒక అట్టడుగు వర్గాల బిడ్డ, దళిత బిడ్డ శాసనసభ స్పీకర్ గా ఉంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు రాకుండా ఉంటారు. కానీ ఆయన పార్టీకి చెందిన నాయకులు మాత్రం బయటకు వచ్చి డ్రామాలు చేస్తున్నారు.స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు పై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. ఆయనను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టాలని నేను డిమాండ్ చేస్తున్నానని పిర్యాదు చేశారు.తాతా మధు చేసిన వ్యాఖ్యల పై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలి. తన పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాజ్యాంగ పదవిని అవమానించేలా మాట్లాడినా కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలి.శాసనసభ, స్పీకర్ పదవి పట్ల కనీస గౌరవం లేని విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలని పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బాల్మంచ్ అధ్యక్షులు జిన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కిరణ్, సురేందర్ రెడ్డి, ఐలయ్య, డిసిసి నాయకులు బుచ్చిరెడ్డి, రవీందర్, మధు, సురేష్, రాజు, వెంకన్న, మహిళా నాయకురాలు పల్లెపు అనూష తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ బియ్యం డెలివరీలో జాప్యం సహించం

- బకాయిలు చెల్లించకుంటే డిఫాల్ట్ మిల్లర్ల ఆస్తులపై చర్యలు
- వానాకాలం ధాన్యం నిల్వకు 2 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల గుర్తింపు



**పెద్దపల్లి మహా, సెప్టెంబర్ 07 :** 202526 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రైస్ మిల్లర్లను ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీలో జాప్యం జరిగితే ప్రభుత్వ లక్ష్యాలపై ప్రభావం పడుతుందని, మిల్లర్లు బాధ్యతగా వ్యవహరించి నిర్ణీత సమయంలో బియ్యం అందజేయాలని సూచించారు.
సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి కలెక్టర్ రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. సీఎంఆర్ డెలివరీ పురోగతి, డిఫాల్ట్ మిల్లర్ల బకాయిలు, ధాన్యం నిల్వకు గోదాముల లభ్యత తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యం డెలివరీలో ఎలాంటి జాప్యానికి తావివ్వరాదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేందుకు మిల్లర్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**బకాయిలు చెల్లించకుంటే కఠిన చర్యలు!**

జిల్లాలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లు తమ బకాయిలను వెంటనే చెల్లించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాలను సకాలంలో చెల్లించి సహకరించాలని మిల్లర్లను కోరారు.
అదేవిధంగా బకాయిలను పూర్తిగా చెల్లించిన రైస్ మిల్లర్లకు తదుపరి సీజన్‌లో ధాన్యం అలాట్మెంట్ చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

**2 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం.**

వానాకాలం ధాన్యం కొనుగోళ్లను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసే సామర్థ్యంతో గోదాములను ముందుగానే గుర్తించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన తర్వాత నిల్వకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.
అనుమతి లేకుండా గోదాములు కేటాయించొద్దు ప్రభుత్వ గోదాములను ఎలాంటి అనుమతి లేకుండా ఎవరికీ కేటాయించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. గోదాముల లభ్యత, నిల్వ సామర్థ్యం, వినియోగం పై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.సీఎంఆర్ డెలివరీ, ధాన్యం నిల్వ, గోదాముల నిర్వహణ తదితర అంశాల్లో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



# తమన్నా భాటియా గ్లామరస్ లుక్

బాల్కనీలో తీసుకున్న తాజా ఫొటోలో నటి తమన్నా భాటియా ఎంతో స్టైలిష్‌గా, గ్లామరస్‌గా కనిపించారు. బ్రౌన్ చెక్‌డ్ బ్లేజర్, గోల్డ్ బటన్లతో కూడిన ఈ లుక్‌లో ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేవీ హెయిర్, కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్‌తో తమన్నా ఫొటోకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. సింపుల్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఈ పోర్ట్రెయిట్ లో ఆమె వ్యక్తిత్వం, ఫ్యాషన్ సెన్స్ స్పష్టంగా కనిపిస్తోంది. సంప్రదాయ గ్లామర్‌కు భిన్నంగా సొగసైన, ఆధునిక స్టైల్‌ను ఎంచుకోవడం అభిమానులను ఆకట్టుకుంటోంది.ముంబైలో జన్మించిన తమన్నా 15 ఏళ్ల వయసులో 2005లో విడుదలైన 'చంద్ సా రోషన్ చెహ్రా'తో నటిగా కెరీర్ ప్రారంభించారు. అదే ఏడాది 'శ్రీ' సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టారు. అనంతరం 2006లో 'కేడీ' చిత్రంతో తమిళంలోకి ఎంట్రీ ఇచ్చారు. 'హ్యాపీ డేస్', 'కల్లూరి' సినిమాలతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా 'హ్యాపీ డేస్'లో ఆమె పోషించిన పాత్ర యువతలో తమన్నాకు ప్రత్యేక క్రేజ్‌ను తీసుకొచ్చింది. ఆ తర్వాత వరుస అవకాశాలు రావడంతో దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికల సరసన నిలిచారు.'అయాన్', 'పైయ్యా', 'సిరుత్తై', '100% లవ్' వంటి విజయవంతమైన చిత్రాలతో తమన్నా స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ముఖ్యంగా తెలుగు సినిమాల్లో ఆమె చేసిన పాత్రలు కమర్షియల్‌గానే కాకుండా కుటుంబ ప్రేక్షకులను కూడా ఆకట్టుకున్నాయి. 'బాహుబలి: ది బిగినింగ్', 'బాహుబలి: ది కన్‌క్లూజన్' చిత్రాల్లో అవంతిక పాత్రతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈ సినిమాల విజయంతో తమన్నా క్రేజ్ దక్షిణాది నుంచి పాన్ ఇండియా స్థాయికి చేరుకుంది.ఇప్పటివరకు 80కి పైగా సినిమాల్లో నటించిన ఆమె తెలుగు, తమిళం, హిందీ చిత్ర పరిశ్రమల్లో తనదైన ముద్ర వేశారు. హీరోయిన్‌గా మాత్రమే కాకుండా ప్రత్యేక పాటలు, అతిథి పాత్రలు, విభిన్నమైన క్యారెక్టర్లతోనూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లు, డిజిటల్ ప్రాజెక్టుల్లోనూ తన ప్రతిభను చూపిస్తూ కొత్త తరహా పాత్రలను ఎంచుకుంటున్నారు. ఫ్యాషన్ విషయంలోనూ తమన్నా ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్స్‌ను ఫాలో అవుతూ సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు.ఇటీవల 'జైలర్', 'అరణ్మనై 4', 'స్త్రీ 2', 'వేదా', 'ఓదెల 2', 'రైడ్ 2' వంటి చిత్రాల్లో కనిపించారు.



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్'పై ప్రేక్షకుల్లో ఇప్పటికే ఆసక్తి నెలకొంది. సినిమా రిలీజ్‌కు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ క్రేజ్‌ను మరింత పెంచుకోవడానికి చిత్రబృందానికి ఇదే సరైన సమయంగా కనిపిస్తోంది. విడుదల తేదీ విషయంలో స్పష్టత కోసం ఎదురుచూపులు ఉన్నప్పటికీ.. అందుబాటులో ఉన్న సమయాన్ని ప్రమోషన్స్‌కు బలంగా ఉపయోగించుకోవడం కీలకంగా మారింది.సినిమాకు బజ్ రావడం ఒక అంశమైతే.. ఆ బజ్‌ను థియేటర్‌లో సినిమా చూడాలనే కోరికగా మార్చడం మరో అంశం. ప్రస్తుతం 'ది ప్యారడైజ్'కు మొదటి విషయంలో పెద్దగా ఇబ్బంది కనిపించడం లేదు. ఇక ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీ పెంచి, థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌పై ఆసక్తి కలిగించడమే ప్రమోషన్ టీమ్ ముందున్న అసలు సవాల్.ఇకపై విడుదలయ్యే ప్రతి కంటెంట్ సాధారణ అప్డేట్‌లా కాకుండా ప్రత్యేకంగా నిలిచేలా ఉండాలి. పాటలను విడుదల చేసినప్పుడు మ్యూజిక్‌పైనే కాకుండా సినిమాలోని ప్రపంచం, పాత్రలపై కూడా చర్చ జరిగేలా ప్లాన్ చేయాలి. అదే విధంగా ట్రైలర్ విషయంలోనూ కథను పూర్తిగా రివీల్ చేయకుండా.. సినిమా నేపథ్యం ఏమిటి? నాని పాత్ర ఎలా ఉండబోతోంది? శ్రీకాంత్ ఓదెల ట్రీట్‌మెంట్ ఏ స్థాయిలో ఉండనుంది? అనే ప్రశ్నలకు సమాధానాల కోసం ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చేలా ఆసక్తిని పెంచాలి. ర్ ద్వారా సినిమా ఏ తరహాలో ఉండబోతోందనే అవగాహన రావాలి. అయితే కథలోని కీలక మలుపులు ముందుగానే తెలిసిపోకూడదు. ఈ సమతుల్యత సాధిస్తే సోషల్ మీడియాలో జరిగే చర్చ సిని అదనపు ప్రచారంగా మారుతుంది. పాన్ ఇండియా మార్కెట్ విషయంలోనూ చిత్ర బృందం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. తెలుగులో నాని క్రేజ్, శ్రీకాంత్ ఓదెలకు ఉన్న గుర్తింపు సినిమాకు ప్లస్ పాయింట్లు. అయితే ఇతర భాషల ప్రేక్షకులను ఆకట్టుకోవాలంటే కేవలం డబ్బింగ్‌తో సరిపెట్టకుండా.. కథాంశం, నాని క్యారెక్టర్, విజువల్ ట్రీట్‌మెంట్, సంగీతం వంటి అంశాల్లో ఏది వారికి ఎక్కువగా కనెక్ట్ అవుతుందో గుర్తించి ప్రమోషన్స్‌లో దానిని ప్రధానంగా చూపించాలి.అలాగే ప్రమోషనల్ కంటెంట్‌ను ఒకేసారి ఎక్కువగా విడుదల చేయడం కంటే.. ఒక్కో అప్డేట్ తర్వాత మరో అప్డేట్ కోసం ప్రేక్షకులు ఎదురుచూసేలా ఆసక్తిని కొనసాగించడం మంచిది. పాట, టీజర్, ట్రైలర్, ఈవెంట్స్ ఇలా ప్రతి దశలో హైప్ స్థాయి క్రమంగా పెరిగేలా వ్యూహం ఉండాలి.సినిమా విడుదలైన తర్వాత వచ్చే టాక్ ఎలా ఉంటుందో ముందుగా చెప్పడం సాధ్యం కాదు. అయితే విడుదలకు ముందు ప్రేక్షకుల్లో థియేటర్లకు వెళ్లాలనే ఆసక్తిని మాత్రం చిత్ర బృందం పెంచగలదు. ప్రస్తుతం 'ది ప్యారడైజ్'కు ఉన్న క్రేజ్‌ను సరైన ప్రమోషన్‌తో డిమాండ్‌గా మార్చగలిగితే.. ఆ డిమాండ్ థియేటర్ ఆక్యుపెన్సీగా మారే అవకాశం ఉంటుంది. అందుకే ప్రస్తుత సమయాన్ని చిత్రబృందం ఉపయోగించుకోవడం చాలా కీలకం.కావాలంటే దీనికి **4-5 పదాల మాస్ హెడ్డింగ్‌లు, షార్ట్ న్యూస్ వెర్షన్ లేదా పేపర్ సబ్‌ఎడిటర్ స్టైల్ వెర్షన్** కూడా తయారు చేస్తాను.

# అదితి బోల్డ్ లుక్ వైరల్

మోడల్, నటి అదితి బుధతోకి సోషల్ మీడియాలో మరోసారి సందడి చేస్తున్నారు. తన బోల్డ్ అండ్ ఎలిగెంట్ ఫ్యాషన్ సెన్స్‌తో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నారు. కమర్షియల్ మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన అదితి.. ఆ తర్వాత సినిమాల్లోకి అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అందం, స్టైల్, కాన్ఫిడెన్స్‌తో ఆమెకు సోషల్ మీడియాలో ప్రత్యేకమైన అభిమాన వర్గం ఏర్పడింది.తాజాగా అదితి షేర్ చేసిన ఫొటో గ్యాలరీ వైరల్‌గా మారింది. క్రిమ్సన్ కలర్ కార్సెట్ స్టైల్ టాప్, దానికి మ్యాచ్ అయ్యే స్కర్ట్‌లో ఆమె ఎంతో గ్లామరస్‌గా కనిపించారు. అద్దం ముందు తీసుకున్న మిర్రర్ సెల్ఫీలో అదితి తన స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకున్నారు. మినిమలిస్ట్ జ్యువెలరీ, రెడ్ యాక్సెసరీస్, సింపుల్ మేకప్‌తో ఆమె లుక్‌ను మరింత ఎలిగెంట్‌గా తీర్చిదిద్దారు. పెద్దగా హంగామా లేకుండానే తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌ను చాటుకున్నారు.అదితి ఫ్యాషన్ ఎంపికల్లో ఎప్పుడూ ప్రత్యేకత కనిపిస్తుంది. ట్రెండీ దుస్తులను తనదైన శైలిలో ధరించడం ఆమెకు అలవాటు. ముఖ్యంగా ఫొటోషూట్లు, సోషల్ మీడియా పోస్టుల్లో ఆమె చూపించే కాన్ఫిడెన్స్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సాధారణ పోర్ట్రెయిట్‌ను కూడా ఎడిటోరియల్ ఫ్యాషన్ ఫొటోలా మార్చేలా ఆమె స్టైలింగ్ ఉంటుంది. మోడలింగ్ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అదితి.. ఆ తర్వాత భారతీయ మ్యూజిక్ వీడియోల్లోనూ కనిపించారు. 'మైన్ తేరీ హో గయీ', 'హవా బన్కే' వంటి పాపులర్ మ్యూజిక్ వీడియోలతో ఆమెకు మరింత క్రేజ్ వచ్చింది. ఈ పాటల్లో తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.ఇక నేపాలీ సినీ పరిశ్రమలోనూ అదితి తనదైన ముద్ర వేస్తున్నారు. మోడలింగ్ నుంచి మ్యూజిక్ వీడియోలు, అక్కడి నుంచి సినిమాల వరకు ఆమె ప్రయాణం కొనసాగుతోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అదితి.. ఎప్పటికప్పుడు తన కొత్త ఫొటోలు, ఫ్యాషన్ లుక్స్‌ను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తాజాగా షేర్ చేసిన ఈ క్రిమ్సన్ లుక్ ఫొటోలు కూడా నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



# రెండు అక్షరాల టైటిల్స్ ట్రెండ్

సినిమా ప్రేక్షకుల ముందుకు రాకముందే ఆసక్తిని పెంచే అంశాల్లో టైటిల్‌కు ప్రత్యేక స్థానం ఉంటుంది. కథ, కథనం, నటీనటులతో పాటు సినిమా పేరును కూడా ప్రేక్షకులకు సులభంగా గుర్తుండిపోయేలా పెట్టేందుకు దర్శకనిర్మాతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం టాలీవుడ్‌లో చిన్నగా, క్యాచీగా ఉండే రెండు అక్షరాల టైటిల్స్ ట్రెండ్‌గా మారుతోంది.

తాజాగా ముగ్గురు హీరోల సినిమాలకు 'కాకా', 'దాదా', 'రాకా' వంటి పేర్లు ఖరారు కావడం ఆసక్తిని కలిగిస్తోంది. ఈ మూడు టైటిల్స్‌లో ఒకే తరహా ప్రాస ఉండటంతో సోషల్ మీడియాలోనూ చర్చ మొదలైంది. చిన్నగా ఉండటంతో పాటు పలకడానికి సులభంగా ఉండటం ఈ పేర్లకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.సాధారణంగా ఒకే సమయంలో ఇలాంటి రైమింగ్ టైటిల్స్ రావడం అరుదుగా కనిపిస్తుంది. అయితే ఈ మూడు సినిమాల విషయంలో మాత్రం పేర్ల ఎంపిక యాదృచ్ఛికంగా ఒకే తరహాలో కలవడం సినీ అభిమానులను ఆకట్టుకుంటోంది. టైటిల్ వినగానే క్యారెక్టర్ ఎలా ఉండబోతుందనే ఆసక్తి కూడా ప్రేక్షకుల్లో కలుగుతోంది.ఈ పేర్ల వెనుక ఉన్న మాస్ టచ్ కూడా గమనించాల్సిన అంశమే. 'కాకా', 'దాదా', 'రాకా' వంటి పదాలు సాధారణంగా స్థానిక యాసలో దమ్మున్న వ్యక్తులను లేదా ప్రభావం కలిగిన పాత్రలను సూచించేలా వినిపిస్తాయి. దీంతో ఆయా చిత్రాల్లో హీరోల పాత్రలు పవర్‌ఫుల్‌గా, మాస్ టచ్‌తో, యాక్షన్‌కు ప్రాధాన్యత ఉన్న విధంగా ఉండొచ్చనే అంచనాలు మొదలయ్యాయి.ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం పెరగడంతో చిన్న పేర్లకు మరింత ప్రాధాన్యత లభిస్తోంది. టైటిల్ సులభంగా గుర్తుండటం, హ్యాష్‌ట్యాగ్‌గా ఉపయోగించుకోవడం, పోస్టర్లు మరియు ప్రమోషనల్ కంటెంట్ లో ఆకర్షణీయంగా కనిపించడం వంటి ప్రయోజనాలు ఉంటాయి. అందుకే దర్శకనిర్మాతలు సుదీర్ఘమైన పేర్లకు బదులుగా తక్కువ అక్షరాలతో ఎక్కువ ఇంపాక్ట్ ఇచ్చే టైటిల్స్‌పై ఆసక్తి చూపుతున్నారు.ఇలా ఒకే ప్రాసతో వచ్చిన 'కాకా', 'దాదా', 'రాకా' టైటిల్స్ ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చకు కారణమవుతున్నాయి. సినిమాలు విడుదలయ్యాక ఈ పేర్లు ప్రేక్షకులకు ఎంతవరకు కనెక్ట్ అవుతాయో చూడాలి.





# గోదారి యాసలో సంగీత్ సందడి

యువ కథానాయకుడు సంగీత్ శోభన్ తన సహజమైన నటనతో పాటు చురుకైన మాట తీరుతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. సినిమాల ప్రమోషన్ కార్యక్రమాలు, మీడియా సమావేశాల్లో ఎలాంటి బెరుకు లేకుండా మాట్లాడటం అతడి స్టైల్. ముఖ్యంగా తనదైన హ్యూమర్‌తో సందర్భానికి తగ్గట్టుగా పంచ్‌లు వేయడం అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా 'అంతా రాములు చూసుకుంటారు' టైటిల్ గ్లింప్స్ విడుదల కార్యక్రమంలోనూ అతడి మాటలతో వేదిక సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో సంగీత్ శోభన్ గోదావరి యాసలో మాట్లాడిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యాంకర్ అడగడంతో కార్యక్రమాన్ని సరదాగా పలకరింపులతో ప్రారంభించిన అతడు.. అక్కడికి వచ్చిన మీడియా ప్రతినిధులతోనూ ఆప్యాయంగా మాట్లాడాడు. ఉదయం సమయానికే కార్యక్రమానికి వచ్చిన వారిని తనదైన శైలిలో పలకరించడంతో అక్కడ నవ్వులు పూశాయి. పెద్దగా ముందస్తు సిద్ధత లేకపోయినా సందర్భానుసారం మాట్లాడగల అతడి ప్రతిభ మరోసారి బయటపడింది. గోదావరి ప్రాంతానికి సంబంధించిన భాష, యాసను తెలుగు సినిమాల్లో చాలాకాలంగా ఉపయోగిస్తున్నారు. అయితే సంగీత్ శోభన్ దానిని తన సహజమైన డైలాగ్ డెలివరీతో మరింత వినోదాత్మకంగా మార్చగలుగుతున్నాడు. గతంలో 'MAD' చిత్రంలో అతడి కామెడీ టైమింగ్, మాటల శైలి యువతను బాగా ఆకట్టుకున్నాయి. ఆ సినిమా తర్వాత అతడికి వచ్చిన గుర్తింపు కూడా ఇందుకు నిదర్శనం. ఇప్పుడు 'అంతా రాములు చూసుకుంటారు' సినిమాలో గోదావరి ప్రాంతానికి చెందిన యువకుడి పాత్రలో కనిపించనున్నాడు. ఈ నేపథ్యంలో అక్కడి యాస, మనస్తత్వం, అమాయకత్వాన్ని తన నటన ద్వారా వినోదాత్మకంగా చూపించే అవకాశం ఉంది. టైటిల్ గ్లింప్స్ కార్యక్రమంలో అతడు మాట్లాడిన తీరు చూస్తే.. సినిమాలోనూ తన మాటలతో నవ్వులు పూయించే పాత్రలో కనిపించనున్నాడనే అంచనాలు పెరుగుతున్నాయి.ఈ కార్యక్రమంలో తన కెరీర్ గురించి కూడా సంగీత్ ఆసక్తికరంగా మాట్లాడాడు. 'MAD' తర్వాత ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనను ప్రస్తావిస్తూ.. తనకు దక్కుతున్న ఆదరణను సరదాగా రాముడి ఆశీర్వాదంతో ముడిపెట్టడం ఆకట్టుకుంది. తాను తరచుగా మీడియా ముందుకు రానని చెప్పడంతో పాటు, ఇంటర్వ్యూల విషయంలో తన కేర్‌ఫ్రీ నేచర్‌ను హాస్యంగా వివరించాడు.అంతేకాదు, సుదీర్ఘమైన ప్రసంగం కంటే మీడియాతో నేరుగా ప్రశ్నలు, సమాధానాల రూపంలో మాట్లాడటానికే ప్రాధాన్యత ఇవ్వడం అతడి సహజమైన వ్యక్తిత్వాన్ని చూపించింది. ఎలాంటి ఒత్తిడి లేకుండా మైక్ అందుకున్న వెంటనే సందర్భానికి తగ్గట్టుగా మాట్లాడటం సంగీత్ శోభన్‌లోని మరో ప్రత్యేకతగా చెప్పొచ్చు. గోదావరి యాసను తన కామెడీ టైమింగ్‌తో కలిపి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తున్న ఈ యువ హీరో.. 'అంతా రాములు చూసుకుంటారు'తో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాడో చూడాలి.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034